# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 11-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:264 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

పలు గుర్తింపులు పొందుచు
విలువలు గల మారథాను విబుధులు మెచ్చన్
తెలగాణములో జరుగగ
పులకించిరి తెలుగులు తమ పుణ్యం బనుచున్ !!

(పలురకాల గుర్తింపులు పొందిన మారథాను తెలంగాణా లో అందునా హైదరాబాద్ లో జరగడం దానికి అంతర్జాతీయ గుర్తింపు రావడం తెలుగు వారందరికీ సంతోషాన్ని కలిగించింది.)



-రాధశ్రీ
సెల్:9494481210

## అయోధ్య కేసుపై జూలై 13న సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ, జులై 10: అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై నమోదు అయిన పిటీషన్లపై జూలై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జూలై 7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14 రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది.

# ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపండి..

## -రైతులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

సిద్దిపేట జిల్లా, జులై 10: ఆయిల్ పామ్ సాగు పెంచడానికి 5 ఎకరాలపైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు(శుక్రవారం) హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి లేదని.. రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపాలని కోరారు. నర్మేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు.

జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు దాటిస్తే రూ.5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలపైన సాగు ప్రోత్సహిస్తే రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. ఎల్‌నినో రాబోతోందని.. తీవ్ర కరవు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయని మంత్రి తెలిపారు. దీంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని.. వాతావరణ మార్పుల ఇబ్బంది ఉండదని చెప్పుకొచ్చారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం గురించి ఆలోచించే వారు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు.

దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరం: వివేక్

దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరమని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని.. ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. అందుకోసం సొంతంగా ఉత్పత్తి పెంచాలని కోరారు. గత సంవత్సరం కాళేశ్వరం ప్రాజెక్ట్ లేనప్పటికీ 25 శాతం అదనంగా వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఆయిల్ పామ్‌కు పెద్దగా నీళ్లు అవసరం లేదన్నారు. చెన్నూరులో కూడా ఆయిల్ పామ్ సాగు వైపు చూస్తున్నారన్నారు '100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ప్రోత్సాహకం ఇస్తే.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా రూ.5 లక్షలు ఇస్తాను' అని మంత్రి వివేక్ ప్రకటించారు.

# హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం.. ఐదుగురు ముఠా సభ్యుల అరెస్ట్

హైదరాబాద్, జులై 10: హైదరాబాద్ అత్తాపూర్‌లో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి డ్రగ్స్ విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మహానగరంలో డ్రగ్స్ రవాణా, విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ ఎస్‌వోటీ బృందం, అత్తాపూర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన మెరుపు దాడుల్లో ఒక ప్రమాదకర డ్రగ్స్ ముఠా గుట్టురట్టయింది. అత్తాపూర్ పరిధిలో యథేచ్ఛగా మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు నిందితులు పోలీసుల నుంచి తప్పించుకుని పరారయ్యారు. పట్టుబడిన నిందితుల నుంచి భారీ మొత్తంలో ఎండీఎంఏ డ్రగ్స్, నిషిద్ధ ఇంజెక్షన్లు, టాబ్లెట్లతో పాటు ఒక కత్తి, ఐదు మొబైల్ ఫోన్లు, రూ. 16,930 నగదును పోలీసులు సీజ్ చేశారు.

పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ ముఠా డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితులు నగరంలోని దారుల్‌షిఫా ప్రాంతం నుంచి తక్కువ ధరకే ఈ డ్రగ్స్‌ను కొనుగోలు చేసి, వాటిని అత్తాపూర్‌కు తరలించి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ దందాలో వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడానికి సయ్యద్ అబుల్ హసన్ (ఏ2) అనే ఆటో డ్రైవర్‌ను కీలక వనరుగా వాడుకున్నారు. అరెస్టయిన వారిలో సయ్యద్ అబుల్ హసన్‌తో పాటు సైఫ్ అలీ మీర్జా, అహ్మద్ హుస్సేన్, షేక్ అయూబ్, మీర్ షబ్బీర్ అలీ ఉన్నారు. ఈ ముఠాలో కీలకమైన ప్రధాన నిందితుడు (ఏ1) బాకర్, ముజాహిద్ అనే ఇద్దరు వ్యక్తులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కాగా, ఈ కేసులో కీలకంగా ఉన్న హసన్‌పై గతంలోనే పలు పోలీస్ స్టేషన్లలో చోరీలు, దోపిడీలు, ఎన్‌డీపీఎస్ (ఔఆఖూ) చట్టం కింద అనేక క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పాత నేరస్థులతో ముడిపడి ఉన్న ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌పై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి, దీని వెనుక ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

# హరీశ్ కాంగ్రెస్‌లోకి వస్తానంటే చర్చిస్తాం: మహేశ్ కుమార్

హైదరాబాద్, జులై 10: మూడు నెలలు నీటిపారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామన్నారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకోవాలా.. వద్దా.. అని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పదేండ్లు ఏం చేయని వారు మూడు నెలల సమయంలో ఏం చేస్తారని అన్నారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై..

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై మహేశ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమన్నారు. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామన్నారు. పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని అన్నారు. సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదన్నారు. ప్రభుత్వాన్ని కూలగొడతామని అన్నప్పుడు.. పది మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని చెప్పారు. నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల మంత్రిగా ఉన్నారని మహేశ్ గుర్తుచేశారు.

# పూరి రథయాత్ర.. డ్రోన్లపై నిషేధం

పూరి, జులై 10: జన్నాథుడి రథయాత్ర కోసం పూరిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జూలై 16వ తేదీ నుంచి 27వ తేదీ వరకు రథయాత్ర జరగనున్నది. అయితే ఆ సమయంలో డ్రోన్లపై నిషేధం విధించారు. అయిదు కిలోమీటర్ల పరిధి వరకు నో ఫ్లయింగ్ జోన్ ప్రకటించారు. రథయాత్రను నిర్విఘ్నంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెప్పారు. అయితే అనుమతి ఉన్న ఏజెన్సీలు తమ డ్రోన్లను ఆపరేట్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఏరియల్ సర్వే, సెక్యూర్టీ ఆపరేషన్స్, ఏరియల్ ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మ్యాపింగ్, డాక్యుమెంటేషన్, డిజాస్టర్ రెస్పాన్స్ కోసం డ్రోన్లను వినియోగించనున్నారు. దీనికి జిల్లా యంత్రాంగం అనుమతి అవసరం ఉంటుంది.

# ఎన్‌కౌంటర్‌లో 60 రౌండ్ల ఫైరింగ్..

## నలుగురు గ్యాంగ్‌స్టర్లు మృతి.. ముగ్గురు పోలీసులకు గాయాలు

గురుగ్రామ్: ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లో గురువారం రాత్రి పోలీసులు, నేరస్థుల మధ్య ఫైరింగ్ జరిగింది. సుమారు 60 రౌండ్ల పాటు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఆ ఘటనలో నలుగురు నేరస్థులు మృతిచెందగా, ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. గురుగ్రామ్‌లోని సుశాంత్ లోక ఫేజ్‌లో ఆ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం రాత్రి 9.30 నిమిషాలకు క్రైం బ్రాంచ్ పోలీసులు సమాచారం అందుకున్నారు. ఓ స్కార్పియో ఎస్‌యూవీలో సాయుధ వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. ఆ ఇంటెలిజెన్స్ ఆధారంగా క్రైం బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సువాంత్ లోక్ ఫేజ్‌లో ఉన్న ఓ వ్యాపారి ఇంటి వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. విదేశాల్లో ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్.. వ్యాపారి నుంచి బెదిరింపుకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అనుమానిత నిందుతలను పోలీసులు చుట్టుముట్టారు. లొంగిపోవాలని ఆదేశించారు. కానీ నిందిత వ్యక్తులు విచక్షణారహితంగా ఫైరింగ్ చేశారు. ఆ కాల్పులకు కౌంటర్‌గా పోలీసులు ఫైరింగ్‌కు దిగారు.

దీపక్ నందల్ గ్యాంగ్‌కు చెందిన షూటర్లు ఈ కాల్పుల్లో పాల్గొన్నారు. అందరికీ గాయాలు అయినట్లు తెలిసింది. ఓ ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కానీ నలుగురు మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. అయిదో వ్యక్తి మాత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు గురుగ్రామ్ పోలీసులు కూడా గాయపడ్డారు. వాళ్లను కూడా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# చైనాలో దూసుకొస్తున్న రక్కసి తుఫాను..

చైనా, జులై 10:చైనా వైపు మరో రక్కసి తుఫాను దూసుకొస్తోంది. తూర్పు తీరంవైపు బావి తుఫాను వస్తోందని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. తుఫాను తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న రీత్యా వాతావరణ శాఖ గురువారమే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శనివారం తుఫాను మొదట తైవాన్‌ను తాకి అనంతరం చైనాలోని ఫుజియన్, జెజియాంగ్ ప్రావిన్సుల్లో తీరాన్ని తాకనుంది. ప్రభావిత ప్రావిన్సుల్లో 40 సెంటీమీటర్ల వరకూ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు.

రక్కసి తుఫాను దూసుకొస్తున్న నేపథ్యంలో చైనా ప్రభుత్వం అప్రమత్తమైంది. తీరానికి సమీపంలోని 17 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. 1.70 లక్షల మంది విపత్తు నిర్వహణ సిబ్బందిని సిద్ధంగా ఉంచింది. తీర ప్రాంతాలతో పాటూ బీజింగ్ వరకూ తుఫాను ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం మధ్యాహ్నమే రాజధాని బీజింగ్‌లో అధికారులు ఎమర్జెన్సీని ప్రకటించారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. క్రీడాకార్యక్రమాలను వాయిదా వేశారు. ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు, గాలులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తైవాన్‌లో కూడా హైఅలర్ట్ ప్రకటించారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికే విమాన సర్వీసులు నిలిచిపోయాయి. హాంకాంగ్ ఎయిర్‌లైన్స్ పలు విమాన సర్వీసులను రద్దు చేసింది. గ్రేటర్ బే ఎయిర్‌లైన్స్ కూడా పలు విమాన సర్వీసులను నిలిపివేసింది. మిగిలిన విమానాలను దారి మళ్లించింది.

# ప్రజా భవన్‌లో ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్‌ను కలిసిన కొండా సురేఖ

హైదరాబాద్, జులై 10: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వ్యవహార శైలిపై మంత్రి కొండా సురేఖ ప్రజా భవన్‌లో ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అలాగే సాయంత్రం సచిన్ సావంత్‌ను కడియం శ్రీహరి సైతం కలువనున్నారు. కాగా, మంత్రి సురేఖకు తెలియకుండానే కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలోని ఆలయాల పరిస్థితులపై హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ కమిషనర్‌తో ఎండోమెంట్ రివ్యూ నిర్వహించిన విషయం తెలిసిందే.

దేవదాయ శాఖ మంత్రినైన తనకే తెలియకుండా కడియం శ్రీహరి రివ్యూ చేయడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కడియంపై స్టేట్ కమాండ్‌కి కాకుండా నేరుగా ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన సచిన్ సావంత్ ఇరువురితో మాట్లాడనున్నారు.

# స్పెయిన్‌లో హీట్‌వేవ్.. కార్చిచ్చుకు 12 మంది బలి



న్యూ ఢిల్లీ, జులై 10: స్పెయిన్‌లో తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. దీంతో దావానలం చెలరేగుతోంది. అండలూసియన్ ప్రాంతంలో సుమారు 12 మంది మృతిచెందారు. మరో ఆరుగురు గాయపడ్డారు. దాదాపు 150 మంది ఫైర్‌ఫైటర్లు మంటల్ని ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. అల్మేరియాలోని లాస్ గల్లార్డోస్‌లో కార్చిచ్చు వ్యాపిస్తున్నది. దక్షిణ యూరోప్‌లో గత కొన్ని రోజుల నుంచి 40 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఫ్రాన్స్, పోర్చుగల్, స్పెయిన్ దేశాల్లో ఎండ తీవ్రత వల్ల అడవులు అంటుకుంటున్నాయి. దీంతో ఫైర్‌ఫైటర్లు ఆ కార్చిచ్చును ఆపే ప్రయత్నంలో ఉన్నారు. వేల సంఖ్యలో జనం తమ ఇండ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్నారు.

దావానలం వల్ల మృతిచెందిన బాధితుల మృతదేహాలు కార్లలోనే ఉన్నాయి. రాత్రి పూట మంటలు వ్యాపించడంతో.. ఎటువెళ్లాలో తెలియని స్థితిలోకి ప్రజలు వెళ్లిపోయారు. మంటల వల్ల రోడ్లను మూసివేశారు. కార్చిచ్చును ఆపేందుకు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ప్రధాని పెడ్రో సాంచేజ్ తెలిపారు. స్పెయిన్ మిలిటరీ ఎమర్జెన్సీ యూనిట్.. లాస్ గల్లార్డోస్‌కు అగ్నిజ్వాలల్ని ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నది. 1950 తర్వాత స్పెయిన్‌లో అత్యధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. గత ఏడాది రికార్డు స్థాయిలో సుమారు 10 లక్షల ఎకరాల అడవి అంటుకున్నది. గత 20 ఏళ్లలో పోలిస్తే ఇది ఆరు రెట్లు ఎక్కువగా తేలింది.

# ఆషాఢ బోనాలకు సర్వం సిద్ధం..

## -బోనాల జాతర పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్, జులై 10: హైదరాబాద్‌లో ప్రతి ఏడాది నిర్వహించే ఆషాఢ బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తాయని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హిందూ, ముస్లిం సమాజాల పరస్పర సహకారం, లౌకిక స్ఫూర్తికి బోనాల ఉత్సవాలు నిదర్శనంగా నిలుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

జూలై 16 నుంచి ప్రారంభం కానున్న గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై గోల్కొండ కోటలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మంత్రి కొండా సురేఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, దేవాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, పోలీసు, ట్రాఫిక్, విద్యుత్, వైద్య ఆరోగ్య, జీహెచ్ఎంసీ, సమాచార శాఖ తదితర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ, జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరిగే బోనాల ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ శాఖలు సంపూర్ణ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సంప్రదాయం ప్రకారం జూలై 16న మధ్యాహ్నం గోల్కొండ జగదాంబికా మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. లంగర్‌హౌస్ కూడలి నుంచి ప్రారంభమయ్యే బోనం, తొట్టెల ఊరేగింపు, మెట్ల పూజ కార్యక్రమాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

బోనాల సందర్భంగా ట్రాఫిక్ నిర్వహణ, పార్కింగ్, క్యూ లైన్లు, బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అగ్నిమాపక ఏర్పాట్లు, ప్రత్యేక బస్సులు వంటి అన్ని సౌకర్యాలు సమగ్రంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్ సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉత్సవాల సమయంలో ప్రత్యేక పోలీసు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. సీసీ కెమెరాల నిఘా, ట్రాఫిక్ నియంత్రణ, మహిళల భద్రత, చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానితుల వివరాలతో అవగాహన పోస్టర్లు ఏర్పాటు చేసి భక్తులను అప్రమత్తం చేయాలని కూడా అధికారులకు సూచించారు.

దైవ సేవకు అంకితమైన శివసత్తులు బోనాల సమర్పణ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని శాఖలు పూర్తి సహకారం అందించాలని మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. భక్తులు ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకుని సంతృప్తిగా తిరిగి వెళ్లేలా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆషాఢ బోనాల జాతర పోస్టర్, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జగదాంబికా మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు.

# కరూర్ తొక్కిసలాట ఘటన.. సీఎం విజయ్ సంచలన కామెంట్లు..

చెన్నై. జులై 10:తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ కరూర్‌లో పర్యటించారు. తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబీకులకు ఉద్యోగ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం విజయ్ మాట్లాడుతూ.. కరూర్ ఘటన తనను ఎంతో బాధించిందని అన్నారు.

ఈ ఘటనను డీఎంకే పార్టీ రాజకీయం చేసిందంటూ మండిపడ్డారు. తొక్కిసలాటకు తనను బాధ్యుడిని చేయాలని డీఎంకే విశ్వ ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. తనకు ప్రజలే ముఖ్యమని, డబ్బు కాదని స్పష్టం చేశారు. ఇప్పుడు కూడా ప్రజల కోసమే కరూర్‌కు వచ్చానని చెప్పారు.

# కంప్యూటర్ నైపుణ్యాలే భవిష్యత్ బలం

## -శిక్షణ పూర్తి చేసుకున్న సిబ్బందికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ల ప్రదానం

సంగారెడ్డి, జులై 10: (నేటినిజం ప్రతినిధి): జిల్లా పోలీసు సిబ్బందిలో వృత్తి పరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు వోక్సెన్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఎంఎస్ ఆఫీస్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం తొలి బ్యాచ్ ముగింపు కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న సిబ్బందికి ఆయన పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది ఆధునిక సాఫ్ట్‌వేర్‌లపై పట్టు సాధించడం అత్యంత అవసరమని తెలిపారు.

ఎంఎస్ ఆఫీస్, ముఖ్యంగా వర్డ్, ఎక్సెల్ వంటి సాఫ్ట్వేర్లలో ప్రావీణ్యం పెరగడం ద్వారా కార్యాలయ పనితీరులో వేగం, ఖచ్చితత్వం, సమర్థత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, స్టేషన్ రైటర్లు, సైబర్ వారియర్స్, టెక్ టీమ్ సిబ్బందికి వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు మొత్తం 180 మంది సిబ్బందిని మూడు బ్యాచ్‌లుగా విభజించి, ప్రతి బ్యాచ్‌కు మూడు రోజుల చొప్పున శిక్షణ అందిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను రోజువారీ విధుల్లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానా న్ని తమ పనితీరును మెరుగుపరచుకునే సాధనంగా మలుచుకోవాలని సిబ్బందికి సూచించారు.పోలీసు శాఖలో సేవల నాణ్యతను పెంచడంలో ఇటువంటి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్న తొలి బ్యాచ్ సిబ్బందికి ఎస్పీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహ కరించిన వోక్సెన్ యూనివర్సిటీ యాజమా న్యం, ప్రొఫెసర్లకు పోలీసు శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వోక్సెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, జిల్లా పోలీసు అధికారులు, శిక్షణ పొందిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 12 నుంచి ఓదెల మల్లికార్జున స్వామి పెద్దపట్నం బ్రహ్మోత్సవాలు

కరీంనగర్, జులై 10: (నేటినిజం ప్రతినిధి) ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రాలలో ఒకటైన ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో ఈ నెల 12, 13 తేదీల్లో పెద్దపట్నం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. గత మార్చి నెలలోని ఉగాది పర్వదినాన ప్రారంభమైన ఓదెల మల్లికార్జున స్వామి జాతర నాలుగు నెలల పాటు అత్యంత వైభవంగా ప్రతీ ఆది, బుధవారాల్లో జరిగాయి.

ఈ జాతర వేసవి కాలమంతా జరగడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

జులై నెలలోని రెండో ఆదివారం జరిగే పెద్దపట్నం బ్రహ్మోత్సవాలతో ఈ జాతర ముగియనుంది.

ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానుండటంతో గత వారం రోజులుగా ఆలయ ఆవరణలో ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. 12న రాత్రి 8 గంటలకు శ్రీ భద్రకాళి అవహన, రాత్రి 10 గంటల నుంచి పెద్దపట్నం, 13న తెల్లవారుజామున 5 గంటలకు అగ్నిగుండం దాటుట, అనంతరం దక్షయాగ కథ శ్రవణం, గెలుపు ఉత్సవములు, ఉదయం 9 గంటలకు స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

# యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేస్తున్నామా !

## (11 జూలై "ప్రపంచ లేదా అంతర్జాతీయ జనాభా దినోత్సవం" సందర్భంగా)

నేడు ప్రపంచ జనాభా దాదాపు 8.2 బిలియన్లు లేదా 820 కోట్లు చేరింది. 1800ల్లో ప్రపంచ జనాభా 1 బిలియన్ ఉండగా, 1987లో 5 బిలియన్ల మార్కు దాటడం, 2011లో 7 బిలియన్లు చేరడం చూసాం. 2026లో ప్రపంచ జనాభా 8.3 బిలియన్లకు చేరడం, 2030 నాటికి 8.5 బిలియన్లకు పెరగడం, 2050 నాటికి 9.7 బిలియన్లు కావచ్చని అంచనా వేస్తున్నారు. 2050 నాటికి ప్రపంచ జనాభాలో 66 శాతం వరకు పట్టణ జనాభా మాత్రమే ఉండవచ్చు. నేడు భారత జనాభా 1.464 బిలియన్లు లేదా 146.4 కోట్లు చేరి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా ప్రథమ స్థానంలో నిలిచింది. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాల జాబితాలో వరుసగా భారత్(146.4 కోట్లు), చైనా(141.6 కోట్లు), అమెరికా(34.7 కోట్లు), ఇండోనేషియా(28.6 కోట్లు), పాకిస్థాన్(25.5 కోట్లు), నైజీరియా(23.8 కోట్లు), బ్రెజిల్(21.3 కోట్లు), బంగ్లాదేశ్(17.6 కోట్లు), రష్యా(14.4 కోట్లు), ఇథియోపియా(13.6 కోట్లు) అను దేశాలు ఉన్నాయి. అత్యధిక జనసాంద్రత కలిగిన దేశాల జాబితాలో మకావ్, మొనాకో, సింగపూర్, హాంకాంగ్ లాంటి దేశాలు ఉన్నాయి. 2025 జనాభా గణాంకాల ప్రకారం, భారత్‌లో అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాల జాబితాలో యూపీ(24 కోట్లు), మహారాష్ట్ర(12.9 కోట్లు), బీహార్(12.7 కోట్లు), పశ్చిమ బెంగాల్(10 కోట్లు), ఎంపీ(8.7 కోట్లు),తమిళనాడు(8.2 కోట్లు), రాజస్థాన్(8.0 కోట్లు), కర్నాటక (7.3 కోట్లు), గుజరాత్(7.1 కోట్లు), ఏపీ(6.0 కోట్లు) లాంటి రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయి. రాష్ట్రాల జాబితాలో 3.85 కోట్ల జనాభాతో 12వ స్థానంలో తెలంగాణ నిలిచింది. తెలంగాణలోని 33 జిల్లాల్లో హైదరాబాద్ జిల్లా 39 లక్షలతో, ఏపీలోని 26 జిల్లాల్లో తూర్పు గోదావరి జిల్లా 51 లక్షలతో ముందు ఉన్నాయి.

### ప్రపంచ జనాభా దినం-2026 ఇతివృత్తం:

11 జూలై 1987 రోజున ప్రపంచ జనాభా 500 కోట్ల లేదా 5 బిలియన్ల మార్కు చేరడానికి (ఐదు బిలియన్ల దినం లేదా ఫైవ్ బిలియన్ డే) గుర్తుగా ప్రతి ఏట 11 జూలై రోజున ఐరాస సభ్య దేశాలు "ప్రపంచ లేదా అంతర్జాతీయ జనాభా దినోత్సవం" జరుపుకోవాలని 1990లో ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించారు. ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదలతో సంబంధం ఉన్న పలు సవాళ్లు, అవకాశాలను చర్చించడం, జనాభా పట్ల కనీస అవగాహన కల్పించడం, జనాభా ఒక మానవ వనరుగా తీర్చిదిద్దుకోవడం, సుస్థిరాభివృద్ధికి బాటలు వేయడం, ప్రజారోగ్యం పట్ల చర్యలు తీసుకోవడం, మానవాళి శ్రేయస్సుకు దోహదపడడం లాంటి అంశాలను చర్చించడం జరుగుతుంది. ప్రపంచ జనాభా దినోత్సవం -2026 ఇతివృత్తంగా "యువత ఆశలు, ఆకాంక్షలు సాకారం చేయడం - నేడు మరియు భవిష్యత్తు కోసం" అనబడే అంశాన్ని తీసుకొని యువశక్తి ప్రాధాన్యాన్ని గుర్తించడం, పునరుత్పత్తి హక్కులను కల్పించడం, లింగ సమానత్వ సాధన, మాతాశిశు ఆరోగ్యం, పేదరిక నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ యువతను శక్తివంతులుగా/నైపుణ్య విద్య కలిగిన వారుగా మార్చడం లాంటి విషయాలను అవగాహన పరచడం జరుగుతుంది.

### ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమాలు:

జనాభా పెరుగుదలతో సుస్థిరాభివృద్ధి సాధించడం, వనరుల నిర్వహణ, జనాభా పెరుగుదలను నియంత్రించడం లాంటి చర్యలు నిరంతరం కొనసాగాలి. ప్రభుత్వాలు, పౌర సమాజం చేయిచేయి కలిపి నాణ్యమైన నైపుణ్యతతో కూడిన విద్య, ఆరోగ్య సంరక్షణ, ఉద్యోగాల కల్పన, కుటుంబ నియంత్రణ లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రచించి, అమలుకు పూనుకోవాలి. ఆర్థిక అస్థిరత, వాతావరణ ప్రతికూల మార్పులు, జనాభా మార్పులను అధ్యయనం చేసుకుంటూ జనాభాను ఒక సంపదగా భావిస్తూ అడుగులు ముందుకు వేయాలి. అధిక యువ జనాభా ఉండడంతో యువతకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చి సుస్థిరాభివృద్ధికి పూనాదులు వేసే అవకాశాలను ఇవ్వాలి. ప్రపంచ జనాభా దినం వేదికగా విద్యాలయాల్లో జనాభాకు సంబంధించిన పోటీలను నిర్వహించడం, ఉపన్యాసాలు, చర్చలు, సెమినార్లు, సాంస్కృతిక ప్రదర్శనలు, వైద్య శిబిరాలు, యువజన కార్యక్రమాలు, అధిక జనాభా వల్ల ఎదురయ్యే సవాళ్లు, పలు దేశాల మధ్య సమన్వయంతో మేలుచేసే కార్యక్రమాలు నిర్వహించపచ్చు.

ప్రపంచ జనాభా దినం మనకు ఒక హెచ్చరిక కావాలి. మన జనాభా మన శక్తిగా మారాలి. యువతకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలకు కూడా సమాంతరంగా ప్రాధాన్యం ఇవ్వాలి. నైపుణ్యంతో కూడిన విద్యకు ప్రపంచ స్థాయిలో డిమాండ్ ఉన్నది. నైపుణ్యం లేని విద్య వ్యర్థం అని తెలుసుకోవాలి. యువ భారతంగా పిలుస్తున్న భారత్‌కు యువశక్తి ఇంధనం మాత్రమే ప్రగతి చక్రాల పరుగులకు ఊతం ఇవ్వాలి. మన అధిక జనాభా మన భవితకు వరం కావాలి. నైపుణ్య విద్య లేని మన యువ జనాభా ఒక శాపంగా మారుతుంది. యువశక్తి నిర్వీర్యం అయితే దేశాభివృద్ధి కుంటుపడుతుంది. అత్యధిక జనాభా కలిగిన భారత్‌లో యువశక్తి కూడా 60 శాతానికి పైగా ఉన్నది. మనకు మాత్రమే అపూర్వ ఆస్తిగా ఉన్న జనాభా భారతమాత సుస్థిరాభివృద్ధికి రాచబాటలు వేయాలి. జనాభా శాపం కాదని, అది వరం మాత్రమే అని రుజువు చేయాలి. "యువ భారత్ సంపన్న భారత్" అని నినదించాలి.



-మధుపాళీ
9949700037

# ఆసియాన్-భారత్ సరకుల వాణిజ్య ఒప్పందం సంయుక్త సంఘం 13వ సమావేశాన్ని వేగవంతం చేయడమే లక్ష్యం

న్యూ ఢిల్లీ, జులై 10:భారత్ 13వ ఆసియాన్-భారత్ సరకుల వాణిజ్య ఒప్పంద (ఏఐటీఐజీఏ) సంయుక్త సంఘం (జేసీ) సమావేశంతో పాటు సంబంధిత ఇతర సమావేశాలను 2026 జులై 6, 10 తేదీల మధ్య న్యూఢిల్లీలోని వాణిజ్య భవన్లో నిర్వహిస్తోంది. దీనిలో ఏఐటీఐజీఏ సమీక్ష ప్రక్రియను చేపట్టి, సంప్రదింపుల్లో ఏమేరకు పురోగతి చోటు చేసుకుందో సమీక్షించారు. ఈ సమావేశాలను హైబ్రిడ్ ఫార్మేట్లో నిర్వహిస్తున్నారు.

ఏఐటీఐజీఏ సంయుక్త సంఘంలో భాగంగా ఉన్న అంతర్గత ఉప సంఘాల్లో నుంచి మూడు ఉప సంఘాలు ప్రస్తుత 13వ సంయుక్త సంఘ సమావేశాలతో పాటే భేటీ అవుతున్నాయి. ఈ మూడు సంఘాల్లోనూ కస్టమ్స్ ప్రక్రియలు, వాణిజ్య సౌలభ్య ఉప సంఘం (ఎస్‌సీ-సీపీటీఎఫ్), నేషనల్ ట్రీట్‌మెంట్ అండ్ మార్కెట్ యాక్సెస్ (ఎన్‌సీ-ఎన్‌టీఎమ్ఏ), మూలానికి సంబంధించిన నియమాల సంఘం (ఎస్‌సీ-ఆర్ఓఓ) ఉన్నాయి.

ఈ సమావేశాలు భారత్, ఆసియాన్ మధ్య సహకారాన్ని విస్తరింప చేసుకొనే, పరస్పర అవగాహనను పెంపొందించుకొనే, నిర్మాణాత్మక చర్చలను ప్రోత్సహించుకొనేందుకు ఒక ముఖ్య వేదికగా ఉంటున్నాయి.

ఉప సంఘాలకు వాటికి సంబంధించిన రంగాలలో వ్యూహాత్మక మార్గదర్శకత్వాన్ని సంయుక్త సంఘం అందించింది. ఏఐటీఐజీఏ సమీక్షలో భాగంగా మిగిలిన అధ్యాయాలకు కూడా త్వరగా తుది రూపురేఖలను ఇవ్వాల్సిందిగా ఉపసంఘాలకు సూచించారు. సంప్రదింపులు పురోగమించేటట్లు చూడడానికి ఉప సంఘాలకు నిర్ణీత కాల లక్ష్యాలను నిర్దేశించారు. అంగీకారం కుదిరిన గడువు లోపల ఖచ్చిత ఫలితాలను రాబట్టడానికి వీలుగా కలిసికట్టుగా పనిచేయాల్సిందిగా కూడా ఉప సంఘాలను ప్రోత్సహించారు.

ఈ నెల 7న నిర్వహించిన 13వ ఏఐటీఐజీఏ సంయుక్త సంఘం సమావేశానికి వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన వాణిజ్య విభాగ అదనపు కార్యదర్శి శ్రీ నితిన్ కుమార్ యాదవ్‌తో పాటు మలేషియాకు చెందిన పెట్టుబడి, వాణిజ్యం, వ్యాపార మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ జనరల్ మస్తురా అహ్మద్ ముస్తఫా సహాధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ఆసియాన్‌కు చెందిన అన్ని సభ్యదేశాలు.. అంటే బ్రూనై, కంబోడియా, ఇండొనేషియా, లావో పీడీఆర్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, వియత్నామ్.. ప్రతినిధి వర్గాలు పాల్గొన్నాయి.

భారత్‌కు చెందిన కీలక వాణిజ్య భాగస్వాముల్లో ఆసియాన్ ఒకటి. దీనికి భారత్ అంతర్జాతీయ వాణిజ్యంలో దాదాపు 11 శాతం వాటా ఉంది. భారత్, ఆసియాన్ ద్వైపాక్షిక వాణిజ్యం 2025-26 లో 128 బిలియన్ అమెరికా డాలర్ల స్థాయికి చేరింది. ఇది ఈ రెండు పక్షాల బలమైన ఆర్థిక భాగస్వామ్యానికి అద్దం పట్టింది. అంతేకాదు.. వాణిజ్యం, పెట్టుబడి సహకారాన్ని మరింత ఎక్కువగా విస్తరించుకొనేందుకు తగిన అవకాశాలను కూడా అందించింది.

# అనుపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**-ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు వలస కూలీల మృతి**
**-20 మందికి తీవ్ర గాయాలు**

కరీంనగర్, జులై 10: (నేటినిజం ప్రతినిధి) :బతుకుదెరువు కోసం మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కూలీలను తిరుగు ప్రయాణంలో మృత్యువు వెంటాడింది. నాట్లు వేసి తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో అతుల్ (35)తో పాటు మరో కూలీ అక్కడికక్కడే మృతిచెందారు. మరో 20 మంది వరకు కూలీలు తీవ్ర గాయాలపా లయ్యారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఘటనాస్థలం విషాదంగా మారింది. ప్రమాదంలో ఓ



ఇద్దరు వలస కూలీలు అక్కడికక్కడే మృతిచెందగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

వేములవాడ అర్బన్ మండలం అనుపురం గ్రామ శివారులో గురువారం ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మహారాష్ట్రకు చెందిన వలస కూలీలు వ్యవసాయ పనుల కోసం తంగళ్లపల్లి మండలం లక్ష్మీపురానికి వెళ్లి నాట్లు పూర్తి చేసుకుని బోయినపల్లి మండలం వరదవెల్లిలోని తమ నివాసాలకు టాటా ఏస్ ట్రాలీలో తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈ క్రమంలో అనుపురం వద్ద సిరిసిల్ల నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి వారి వాహనాన్ని ఢీకొట్టింది.

ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన ద్విచక్రవాహనం కూడా పూర్తిగా ధ్వంసమైంది.

సమాచారం అందుకున్న వేములవాడ పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో క్షతగాత్రులను సిరిసిల్ల, వేములవాడ పరిసర ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ మహేశ్ బి. గితే ప్రమాద స్థలాన్ని పరిశీలించి, అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## రూ. 37,500 కోట్ల ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకానికి దరఖాస్తులు ఆహ్వానించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, జులై 10:13 మే 2026న రూ. 37,500 కోట్ల ఆర్థిక వ్యయంతో ప్రభుత్వం ఆమోదించిన ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకానికి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ దరఖాసులను ఆహ్వానిస్తోంది.

ఈ పథకం ద్వారా బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల విస్తరణ వేగవంతం కానుంది. బొగ్గు ఆధారిత ఉత్పత్తులకు అదనపు విలువను చేకూర్చడం, విదేశాల నుంచి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఇంధన, రసాయన రంగాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి ఈ నిర్ణయం ఊతమివ్వనుంది.

పథకం ఆమోదం పొందిన తర్వాత దానికి సంబంధించిన మార్గదర్శకాలను 25 జూన్ 2026న ప్రభుత్వం విడుదల చేసింది. దీనిని అనుసరిస్తూ 7 జూలై 2026న ప్రతిపాదనల కోసం అభ్యర్థన (ఆర్ఎఫ్‌పీ) పత్రాన్ని కూడా ప్రకటించింది. దీని ద్వారా అర్హులైన దరఖాస్తుదారులు తమ ప్రతిపాదనలను సమర్పించాల్సిందిగా ఆహ్వానిస్తోంది.

భాగస్వాముల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి, పథకం నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియపై స్పష్టత ఇవ్వడానికి మంత్రిత్వ శాఖ 20 జూలై 2026న ముందస్తు అవగాహన సమావేశాన్ని నిర్వహించనుంది. ఆసక్తి గల దరఖాస్తుదారులు, ఇతర భాగస్వాములు ఈ సమావేశంలో పాల్గొని, తమ సందేహాలను నివృత్తి చేసుకోవాల్సిందిగా కోరింది.

దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 7 సెప్టెంబర్ 2026.

పథకం మార్గదర్శకాలు, ప్రతిపాదనల కోసం అభ్యర్థన, వివరణాత్మక దరఖాస్తు కాలపట్టిక బొగ్గు మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల సంస్థలు ఈ పత్రాలను పరిశీలించవచ్చు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

కరీంనగర్, జులై 10:పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో వివాహిత నిమ్మ లావణ్య (34) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు చొప్పదండి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన తిరుపతిని వివాహం చేసుకుంది.

కుటుంబ కలహాల కారణంగా గత రెండు నెలలుగా లావణ్య పుట్టింట్లో ఉంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆమె ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సమాచారం అందుకున్న పెద్దపల్లి రూరల్ ఎస్ఐ మధుకర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

# అంతర్జాతీయ జలాల్లో సుస్థిర మత్స్య సంపద వినియోగానికి సంబంధించిన అధికారిక పత్రాన్ని, ఒడిశా డీప్ సీ ఫిషింగ్ మిషన్ పత్రాన్ని విడుదల చేయనున్న భారత ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, జులై 10:భారత ప్రభుత్వ మత్స్య శాఖ ఆధ్వర్యంలో జులై 9, 2026న ఒడిశాలోని భువనేశ్వర్‌లో అంతర్జాతీయ జలాల్లో స్థిరమైన మత్స్య సంపద వినియోగానికి సంబంధించిన అధికారిక పత్రాన్ని (ఎల్ఓఏ) విడుదల చేసేందుకు జాతీయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ జలాల్లో స్థిరమైన మత్స్య సంపద వినియోగానికి సంబంధించిన అధికారిక పత్రాన్ని భారత గౌరవ ఉప రాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా ఒడిశా డీప్ సీ మిషన్ పత్రాన్ని కూడా ఉప రాష్ట్రపతి విడుదల చేస్తారు.

ఈ జాతీయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఒడిశా గవర్నర్ గౌరవ డాక్టర్ హరిబాబు కంభంపాటి, ఒడిశా ముఖ్యమంత్రి గౌరవ శ్రీ మోహన్ చరణ్ మాఝీ, కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి గౌరవ శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర విద్యాశాఖ మంత్రి గౌరవ శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. వీరితో పాటు కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్.పీ. సింగ్ బఘేల్, ఒడిశా ప్రభుత్వ మత్స్య, ఏఆర్‌డీ, ఎంఎస్ఎంఈ శాఖల సహాయమంత్రి (స్వతంత్ర బాధ్యత) శ్రీ గోకులానంద మల్లిక్, భువనేశ్వర్ ఎంపీ శ్రీమతి అపరాజిత సారంగి, కంధమాల్ ఎంపీ శ్రీ సుకాంత పాణిగ్రాహి, ఖుర్దా ఎమ్మెల్యే శ్రీ ప్రశాంత కుమార్ జగదేవ్ ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ఈ వేడుకలో ఒడిశా ప్రభుత్వం, సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖలు, ఇతర విభాగాల అధికారులతో పాటు, మహిళా మత్స్యకారులతో కలిసి సుమారు 1,000 మంది చేపలు సాగు చేసేవారు, మత్స్యకారులు పాల్గొంటారు.

వివిధ కార్యక్రమాల ద్వారా మత్స్య రంగం డిజిటలైజేషన్‌పై దృష్టి సారించటంతో పాటు మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ఎఫ్‌పీఓ), మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేయటానికి భారత ప్రభుత్వ మత్స్య శాఖ ప్రాధాన్యతనిస్తోంది.

నేషనల్ కో-ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ (ఎన్‌సీఈఎల్)తో సహా మత్స్యకార సహకార సంఘాలకు, ఫిషింగ్ నౌకల యజమానులకు ఎల్ఓఏను ఉప రాష్ట్రపతి అందిస్తారు. భారతదేశానికి చెందిన అర్హత గల ఫిషింగ్ నౌకలకు అంతర్జాతీయ జలాల్లో నియంత్రిత చేపల వేటకు ఇది వీలు కల్పిస్తుంది. శ్రీ మహావీర్ మచ్చిమార్ సహకారి మండలి లిమిటెడ్, శ్రీ మార్తాండ ప్రసన్న కొలాబా మత్స్యోద్యోగ వివిధ కార్యకారి సహకారి సంస్థ మర్యాదిత్, సౌత్ గోవా మెకనైజ్డ్ బోట్ ఓనర్స్ కో-ఆపరేటివ్, మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్, పారాదీప్ మెరైన్ ప్రైమరీ ఫిష్ ప్రొడక్షన్, మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, తెంగపట్టణం డీప్ సీ ఫిష్ ప్రొడ్యూసర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ, మాల్పే ఫిషర్ మెన్స్ ప్రైమరీ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వంటి మత్స్యకార సహకార సంఘాలు అవార్డులు అందుకోనున్నాయి. ఈ సంఘాలకు ఎల్ఓఏను అందిస్తారు.

భారతదేశ మత్స్యకార నౌకల ద్వారా అంతర్జాతీయ జలాల్లో స్థిరమైన మత్స్య సంపద వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలు-2025 ప్రకారం అధికారిక పత్రాన్ని (ఎల్ఓఏ) పొందటం తప్పనిసరి నిబంధన. అంతర్జాతీయ జలాల్లో వేట, చేపల వేటకు సంబంధించి కార్యకలాపాల్లో పాల్గొనే భారత ఫిషింగ్ నౌకల కోసం పారదర్శకమైన, బాధ్యతాయుతమైన వ్యవస్థగా దీన్ని రూపొందించారు. నిర్దిష్ట నౌకకు మాత్రమే ఎల్ఓఏ వర్తిస్తుంది. వేరొకరికి బదిలీ చేసేందుకు వీలుండదు. ఇది రియల్‌క్రాఫ్ట్ మత్స్యకార నౌకల నమోదు పోర్టల్‌తో అనుసంధానమై ఉంటుంది. క్రమబద్ధమైన, గుర్తించదగిన, పర్యవేక్షించగలిగే కార్యకలాపాలను ఇది చూసుకుంటుంది. కనీస ఖర్చుతో ఎలాంటి కఠినమైన నిబంధనలు లేకుండా, ఎప్పటికప్పుడు అప్లికేషన్ ట్రాకింగ్ సదుపాయంతో అందుబాటులో ఉండే ఈ ఎల్ఓఏ.. మత్స్యకారులకు, పడవల నిర్వాహకులకు నిబంధనలను సులువుగా పాటించేందుకు సహాయపడుతుంది. ఎల్ఓఏ పొందిన నౌకలు సంబంధిత ప్రాంతీయ మత్స్య నిర్వహణ సంస్థలు (ఆర్ఎఫ్ఎంఓలు) సూచించిన రక్షణ, నిర్వహణ చర్యలను తప్పనిసరిగా పాటించాలి. ఇందులో భాగంగా చేపల వేట పరిమితులు, వేట పరికరాల నిబంధనలు, ఇతర జీవుల మరణాల తగ్గింపు చర్యలు, ఫిష్ అగ్రిగేటింగ్ డివైజ్ (ఎఫ్ఏడీ) నిర్వహణ, ప్రయాణ నివేదికలు, బాధ్యతాయుతమైన, స్థిరమైన చేపల వేట కోసం అవసరమైన ఇతర నిబంధనలను పాటించాల్సి ఉంటుంది.

లోతైన, అంతర్జాతీయ సముద్ర జలాల్లో స్థిరమైన పద్ధతుల్లో చేపల వేట సాగించేందుకు మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్ఎఫ్‌పీఓ), మత్స్యకార సహకార సంఘాలను ఎల్ఓఏ మరింత బలోపేతం చేస్తుంది. దీని వల్ల అధిక విలువ గల సముద్ర వనరులు లభించి, మత్స్యకారుల ఆదాయం పెరుగుతుంది. ఎల్ఓఏ ప్రక్రియ ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. ఈ ప్రక్రియ పారదర్శకంగా, నిర్ణీత సమయానికి పూర్తవుతుంది. తద్వారా మత్స్య రంగంలో సేవల ఒందించటం సులువవుతుంది. పారదర్శకత, చేపల నాణ్యతను గుర్తించటం, సువరిపాలన మెరుగవుతాయి.

ఒడిశా ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక బ్లూ ఎకానమీ కార్యక్రమమే ఒడిశా డీప్ సీ ఫిషింగ్ మిషన్ (2026?2036). రాష్ట్రంలోని తీరప్రాంత, లోతైన సముద్ర మత్స్య సంపద సామర్థ్యాన్ని వెలికితీయటానికి, ఒడిశాను లోతైన సముద్ర చేపల వేట, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులకు ప్రముఖ కేంద్రంగా మార్చటమే ఈ మిషన్ ఉద్దేశం. ఆధునిక మత్స్య పరిశ్రమ మౌలిక సదుపాయాలు, విలువ ఆధారిత వ్యవస్థలు, శాస్త్రీయ మత్స్య నిర్వహణ, మార్కెట్ అనుసంధానాల్లో పెట్టుబడుల ద్వారా చేపల ఉత్పత్తిని పెంచేందుకు, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు, మత్స్యకారుల ఆదాయాన్ని పెంపొందించేందుకు, సముద్ర మత్స్య రంగంలో స్థిరమైన వృద్ధిని సాధించేందుకు ఈ మిషన్ సహకరిస్తుంది.

భారత ఫిషింగ్ నౌకలు భారతదేశ ఈఈజడ్ పరిధికి అవతల ఉన్న ప్రాంతాల్లో చేపల వేటను సాగించేందుకు వీలుగా... క్రమబద్ధమైన, పారదర్శకమైన, స్థిరమైన వ్యవస్థకు ఈ అధికారిక పత్రం (ఎల్ఓఏ), ఒడిశా డీప్ సీ ఫిషింగ్ మిషన్ డాక్యుమెంట్ కీలకంగా నిలుస్తాయి. ఇది అంతర్జాతీయ సముద్ర జలాల్లో స్థిరమైన, బాధ్యతాయుతమైన మత్స్య సంపద సేకరణ దిశగా భారతదేశ ఫిషింగ్ నౌకలకు సాధికారత చేకూరుస్తుంది. అంతర్జాతీయ సముద్ర జలాల్లో మత్స్య వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవటం, మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయటం, సముద్ర ఆహార ఎగుమతులను పెంచటం, ప్రపంచ సుస్థిర ప్రమాణాలకు కట్టుబడి ఉండటం, సంపన్నమైన, సమ్మిళిత బ్లూ ఎకానమీ.. జాతీయ దార్శనికతను ముందుకు తీసుకెళ్లటం పట్ల భారతదేశానికున్న నిబద్ధతకు ఇది నిదర్శనం.

భారతదేశానికి సుమారు 11,099 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతం, దాదాపు 24 లక్షల చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక మండలిలో విస్తారమైన, విభిన్నమైన సముద్ర వనరులున్నాయి. భారతదేశపు ఈఈజడ్ పరిధిలోని సముద్ర మత్స్య సంపద సామర్థ్యం 58.6 లక్షల ఎంటీ ఉన్నట్లు అంచనా. ఇది సుమారు 50 లక్షల మంది మత్స్యకారుల జీవనోపాధికి మద్దతివ్వటమే కాకుండా.. ఆహార భద్రత, పోషకాహారం, ఉపాధి, ఆదాయం, ఎగుమతి రాబడికి దోహదపడుతుంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చేపల వేట, అక్వాకల్చర్ రంగాల్లో భారత్ అగ్రగామిగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశం నుంచి సుమారు రూ.73,890 కోట్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతి జరిగింది.

చాలా మత్స్యకార కార్యకలాపాలు తీరానికి 40-50 నాటికల్ మైళ్ల పరిధిలోనే జరుగుతాయి. అయితే లోతైన జలాలు, దేశ సరిహద్దులకు అవతల ఉన్న ప్రాంతాల్లో ట్యూనా వంటి అధిక విలువ గల చేపల వనరుల వేటకు ఎక్కువగా అవకాశాలున్నాయి. స్థిరమైన సముద్ర మత్స్య పరిశ్రమ వ్యూహాత్మక ప్రాముఖ్యతను గుర్తిస్తూ... భారత ఈఈజడ్, అంతర్జాతీయ జలాల నుంచి మత్స్య సంపదను స్థిరంగా వినియోగించుకునేందుకు అనువైన మార్గదర్శక నిబంధనలను భారత ప్రభుత్వం విడుదల చేసింది. ఇందులో భారత మత్స్యకార నౌకల ద్వారా అంతర్జాతీయ జలాల్లో మత్స్య సంపదను స్థిరంగా వినియోగించుకునేందుకు సంబంధించిన మార్గదర్శకాలు-2025 కూడా ఉన్నాయి.

భారతదేశ ఈఈజడ్, అంతర్జాతీయ జలాల నుంచి మత్స్య సంపదను పర్యావరణహితంగా, స్థిరంగా వినియోగించుకునేందుకు అనుకూలమైన విధానాన్ని తీసుకురానున్నట్లు 2025-26 కేంద్ర బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. వ్యూహాత్మకంగా ఎంతో ప్రాధాన్యత గల సుస్థిర సముద్ర మత్స్య రంగాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా భారతదేశ మొత్తం ఈఈజడ్ విస్తీర్ణంలో దాదాపు 49 శాతం వాటా ఉన్న అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్ వంటి ద్వీప భూభాగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు. సముద్ర మత్స్య రంగంలో ఇప్పటివరకు వినియోగించుకోని అపారమైన అవకాశాలను వెలికితీయటంతో పాటు... స్థిరత్వం, సమానత్వం, జాతీయ సముద్ర ప్రయోజనాలు, మత్స్యకార వర్గాల దీర్ఘకాలిక జీవనోపాధి భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ ప్రకటన తెలియజేస్తోంది.

ఈ లక్ష్య సాధనలో భాగంగా డిసెంబర్ 9, 2025న భారత మత్స్యకార నౌకల ద్వారా అంతర్జాతీయ జలాల్లో స్థిరమైన మత్స్య సంపద వినియోగానికి సంబంధించిన మార్గదర్శకాలు-2025 విడుదలయ్యాయి. భారతదేశ ఈఈజెడ్ పరిధికి అవతల ఉన్న అంతర్జాతీయ జలాల్లో భారత మత్స్యకార నౌకల ద్వారా అధికారిక, నియంత్రిత, బాధ్యతాయుతమైన మత్స్యకార కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు విధానపరమైన చర్యల్లో ఈ నూతన మార్గదర్శకాలు కీలకంగా నిలుస్తాయి. జాతీయ చట్టాలు, అంతర్జాతీయ బాధ్యతలు, పరిరక్షణ నియమాలను పూర్తిగా పాటిస్తూనే.. జాతీయ అధికార పరిధికి అవతల ఉన్న ప్రాంతాల్లో అధిక-విలువైన సముద్ర మత్స్య సంపద రంగంలో భారత్ భాగస్వామ్యం వైపు సాగుతున్న ప్రయాణంలో ఈ విధాన రూపకల్పన కీలక ముందడుగుని సూచిస్తుంది.

# ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించే ఐదు విభాగాల సిబ్బందికి జాతీయ స్థాయి శిక్షకుల శిక్షణ

న్యూఢిల్లీ, జులై 10:ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను అందించే మొత్తం ఐదు విభాగాల సిబ్బంది కోసం జాతీయ స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని (నేషనల్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' – ఎన్టీఓటీ) కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఢిల్లీలో రెండు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించింది. న్యూఢిల్లీలోని నేషనల్ హెల్త్ సిస్టమ్స్ రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ) లో నిర్వహించిన ప్రారంభ సమావేశానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, జాతీయ ఆరోగ్య మిషన్ డైరెక్టర్ శ్రీమతి ఆరాధన పట్నాయక్ అధ్యక్షత వహించారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో నైపుణ్యం, నాణ్యత కలిగిన ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడటం అత్యంత కీలకమని, ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని బలోపేతం చేయడానికి నాణ్యతా ప్రమాణాల ధృవీకరణ అవసరమని శ్రీమతి ఆరాధన పట్నాయక్ అన్నారు. వికేంద్రీకృత అమలు నమూనా ద్వారా ఆయా విభాగాల వారీగా సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ప్రాధాన్యత సంతరించుకుందని ఆమె స్పష్టం చేశారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆగస్టు 2026 నుంచి దేశవ్యాప్తంగా గుర్తించిన 100 కి పైగా ప్రాంతీయ శిక్షణ సంస్థల ద్వారా దశల వారీగా విస్తరించనున్నట్లు ఆమె తెలియజేశారు.

ఆరోగ్య కార్యక్రమాల మధ్య సమన్వయం, వివిధ సంస్థల మధ్య మెరుగైన సహకారం పెంపొందించడం ద్వారా ఆరోగ్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచవచ్చని ఆమె పేర్కొన్నారు. కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే సరిపోదని, ప్రజా కేంద్రిత మానవీయ ఆరోగ్య సేవలు అందించాలంటే ఆరోగ్య సిబ్బంది శిక్షణలో ప్రవర్తనా నైపుణ్యాలు, సానుభూతి దృక్పథం, సమర్థవంతమైన సంభాషణా సామర్థ్యాలను కూడా తప్పనిసరిగా భాగం చేయాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

2026 ఏప్రిల్ 30న చండీగఢ్‌లో నిర్వహించిన జాతీయ ఉత్తమ విధానాల సదస్సు సందర్భంగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాశ్ నడ్డా ఆవిష్కరించిన సమగ్ర శిక్షణ వ్యూహంతో పాటు వివిధ విభాగాల సిబ్బందికి ప్రత్యేకంగా రూపొందించిన శిక్షణ మాడ్యూళ్లను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ ప్రారంభ సమావేశంలో విడుదల చేసింది. సమగ్ర శిక్షణ వ్యూహం (ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ స్ట్రాటజీ?ఐటీఎస్) కార్యక్రమాల వారీగా, కేవలం విజ్ఞానాన్ని పెంపొందించడంపై దృష్టి సారించే శిక్షణ విధానానికి భిన్నంగా, రోగి కేంద్రిత, నైపుణ్యాధారిత శిక్షణ విధానానికి నాంది పలికిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల ద్వారా సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సేవలు అందిస్తున్న వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓలు), సహాయ నర్సు–మిడ్‌వైఫ్స్ (ఏఎన్‌ఎంలు), గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు ప్రవర్తనా నైపుణ్యాలు, ప్రజలతో మమేకమయ్యే సామర్థ్యాలను కూడా పెంపొందించడమే ఈ వ్యూహం ప్రధాన లక్ష్యమని తెలిపింది.

జాతీయ శిక్షకుల శిక్షణ (ఎన్‌టీఓటీ) కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 110 మందికి పైగా మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు. ప్రామాణిక, నైపుణ్యాధారిత శిక్షణ ద్వారా ప్రాథమిక ఆరోగ్య సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలన్న దేశవ్యాప్త ఉమ్మడి సంకల్పానికి ఇది నిదర్శనమని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

జాతీయ శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర అభ్యాస అనుభవాన్ని అందించేలా రూపొందించారు. ఇందులో తరగతి గది బోధన, కేసుల ఆధారిత చర్చలు, జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంస్థ (ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్) స్కిల్ ల్యాబ్‌లో ప్రత్యక్ష ఆచరణాత్మక శిక్షణను నిర్వహించారు. కీలక వైద్య సేవల విభాగాల్లో ఆరోగ్య సిబ్బందికి సాంకేతిక నైపుణ్యాలతో పాటు సాఫ్ట్ స్కిల్స్ ను పెంపొందించడంపై ఈ కార్యక్రమం దృష్టి సారించింది. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆరోగ్య సిబ్బందిని నాణ్యమైన, రోగి కేంద్రిత ఆరోగ్య సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా తీర్చిదిద్దడం దీని లక్ష్యమని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ప్రజల మారుతున్న ఆరోగ్య అవసరాలను తీర్చడానికి అవసరమైన విజ్ఞానం, నైపుణ్యాలు, సానుకూల దృక్పథంతో క్షేత్రస్థాయిలో ముందు వరస ఆరోగ్య కార్యకర్తలను సంసిద్ధం చేయడం ద్వారా ఈ సమగ్ర శిక్షణా వ్యూహం ప్రాథమిక ఆరోగ్య సేవల నాణ్యతను గణనీయంగా పెంపొందిస్తుందని, దేశవ్యాప్తంగా సామర్థ్య పెంపు ప్రయత్నాలను ప్రమాణీకరిస్తుందని, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పాలసీ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీ శిబిన్ సి., ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ (డాక్టర్) ప్రగ్యా శర్మతో పాటు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, నేషనల్ మెడికల్ కమిషన్, మిషన్ కర్మయోగి భారత్ లకు చెందిన ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అగర్తల, జేవర్ విమానాశ్రయాల్లో అధీకృత ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్టుల ఏర్పాటుకు ఆదేశాలు జారీ

న్యూ ఢిల్లీ, జులై 10:ప్రధాన విమానాశ్రయాల్లో ప్రయాణికుల సౌకర్యాలు, భద్రత ఏర్పాట్లు, ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలపై కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షాతో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడు కింజరాపు సమీక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టరు, పౌర విమానయాన శాఖ కార్యదర్శి, కేంద్రీయ పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్, భారత విమానాశ్రయాల ప్రాధికరణ సంస్థ చైర్మన్‌తో పాటు హోం శాఖ, పౌర విమానయాన శాఖలకు చెందిన అనేక మంది ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

మానవ వనరులకయ్యే ఖర్చును తగ్గించే ఉద్దేశంతో అన్ని విమానాశ్రయాల్లో దశల వారీగా యంత్రసాయంతో పనిచేసే (ఆటోమేటెడ్) ఎక్స్–రే ట్రే రిటర్న్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆదేశించారు. ఈ ఆటోమేటెడ్ ఎక్స్–రే ట్రే రిటర్న్ వ్యవస్థను కొత్త విమానాశ్రయాల్లో ఏర్పాటు చేసేటప్పుడు తగిన ప్రమాణాలను ఖరారు చేయాలని ఆయన అన్నారు.

ప్రయాణికుల రాకపోకలకు ఏ ఒక్క ప్రాంతంలోనూ ఎలాంటి ఇబ్బందులూ ఎదురవకుండా ప్రవేశ మార్గాలూ, తనిఖీ కేంద్రాలు, భద్రత వరీక్ష మార్గాలు, ఇమ్మిగ్రేషన్ కౌంటర్ల మధ్య పరస్పర ఆధారిత పద్ధతిని దృష్టిలో పెట్టుకొని ఒక సమగ్ర ప్రాథమిక ప్రణాళికను రూపొందించాలని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఆదేశాలిచ్చారు. ప్రయాణికుల రాకపోకలు సాఫీగా సాగేటట్లు చూడడానికి విమానాశ్రయాల్లో ప్రయాణికులతో సంబంధం ఉన్న ప్రతి ప్రాంతాలను దృష్టిలో పెట్టుకొని ఒక సమన్వయ ప్రణాళికను సిద్ధంగా ఉందని ఆయన అన్నారు.

ప్రయాణికుల రాకపోకల ఆధారంగా ప్రస్తుతం అభివృద్ధి పనులు పురోగమిస్తున్న 21 విమానాశ్రయాలతో పాటు మిగిలిన 41 విమానాశ్రయాలను కూడా పౌర విమానయాన భద్రత మండలి (బీసీఏఎస్) భద్రత ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పరచడానికి ప్రాధాన్యాలను నిర్ధారించాలని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ఆదేశించారు. వాణిజ్య ప్రాంతాలు నిర్దిష్ట ప్రమాణాల్లోనే ఉండేటట్లు జాగ్రత్తచర్యలు తీసుకుంటూ, ప్రయాణికుల సౌకర్యాలను పెంపొందించడం ముఖ్యోద్దేశం కావాలని ఆయన స్పష్టం చేశారు. ఈ 62 విమానాశ్రయాల్లోనూ పనులను రాబోయే రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలని ఆయన అన్నారు.

ప్రయాణికుల రాకపోకలు, ఎయిర్ ట్రాఫిక్ ఆధారంగా అన్ని విమానాశ్రయాలకూ ఏరోబ్రిడ్జుల సంఖ్యకు సంబంధించిన ప్రమాణాలను నిర్దేశించాలని పౌర విమానయాన శాఖను శ్రీ అమిత్ షా ఆదేశించారు. బ్యాగేజి డ్రాప్ సదుపాయం ప్రస్తుతం 16 ప్రధాన విమానాశ్రయాల్లో అందుబాటులో ఉండగా, ఈ సదుపాయాన్ని ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉన్న ఇతర అంతర్జాతీయ విమానాశ్రయాలకు కూడా విస్తరించాలని ఆయన ఆదేశాలిచ్చారు. ఎక్స్–రే స్క్రీనింగ్ కోసం నియమించే కేంద్రీయ పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) సిబ్బంది విద్యార్హతలో ఎలాంటి సడలింపునకూ తావు ఇవ్వకూడదని ఆయన స్పష్టం చేశారు. దీంతోపాటు, కావలసిన విద్యార్హతలు పొందిన అందుబాటులోని అధికారులనూ, సిబ్బందినీ ఎక్స్–రే స్క్రీనింగ్ విధులను అప్పగించాలని కూడా ఆయన ఆదేశించారు.

అన్ని రాష్ట్రాల ప్రధాన కేంద్రాల్లో 2027 కల్లా ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ) కార్యాలయాలు త్వరగా పని ప్రారంభించాలని కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా అన్నారు.

అగర్తలా, జేవర్ విమానాశ్రయాల్లో అధీకృత ఇమ్మిగ్రేషన్ చెక్ పాయింట్లను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని కూడా ఆయన ఆదేశాలిచ్చారు. ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్–ట్రస్టెడ్ ట్రావెలర్స్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీఐ–టీటీపీ)కి మరింత ఆదరణ లభించేలా విమానయాన సంస్థతో సమన్వయాన్ని ఏర్పరుచుకొని అంతర్జాతీయ టికెట్టు బుకింగు సమయంలో, ఎఫ్‌టీఐ–టీటీపీలో నమోదు చేయించుకోవాల్సిందిగా కోరుతూ సంబంధిత ప్రయాణికులకు వాట్సాప్ సందేశాన్ని పంపించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఆయన అన్నారు.

ప్రతి సంవత్సరంలోనూ ప్రయాణాలు అత్యధిక స్థాయిలో నమోదయ్యే కాలంలో ప్రధాన విమానాశ్రయాల్లో ప్రయాణికులకు అవసరం ఉన్న అన్ని ప్రాంతాల వద్దా జాప్యాన్ని అంచనా వేసి, ఆ జాప్యాన్ని తగ్గించడం కోసం పౌర విమానయాన శాఖ, సీఐఎస్ఎఫ్ వేర్వేరుగా మూడో పక్షం సాయంతో అధ్యయనాలను నిర్వహించాలని శ్రీ అమిత్ షా అన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్‌డీఓ



ఆదిలాబాద్, జులై 10:ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆర్‌డీఓ రాథోడ్ మోహన్‌సింగ్, తహసీల్దార్ ఎం. ప్రవీణ్ గురువారం పరిశీలించారు.

ముత్నూర్ గ్రామంలో బీఎల్‌ఓలు మేశ్రం సుమిత్ర, కేశవ్, అస్పత్‌రావుతో కలిసి నమోదు ప్రక్రియను సమీక్షించారు.

ఈ సందర్భంగా అధికారులు బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే డూప్లికేట్ ఓట్లు, మృతి చెందిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలను గుర్తించి జాబితాలను నవీకరించాలని సూచించారు.

ప్రతిరోజూ కనీసం 100 నుంచి 200 వరకు దరఖాస్తులు స్వీకరించి, ఎలాంటి పెండింగ్ లేకుండా ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి అర్హుడి నుంచి దరఖాస్తులు స్వీకరించి లక్ష్యాలను సాధించాలని బీఎల్‌ఓలకు సూచించారు.

# గంజాయి గుట్టురట్టు.. ముగ్గురు అరెస్ట్

ఖమ్మం, జులై 10: నగరంలోని ప్రకాశ్‌నగర్ పుచ్చకాయల కృష్ణయ్య వెంచర్ ప్రాంతంలో అక్రమంగా గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 110 గ్రాముల ఎండు గంజాయి, రెండు ప్లాస్టిక్ బాంగ్ బాటిళ్లు, ఒక అగ్గిపెట్టెను స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపారు.

విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం నిర్వహించిన పెట్రోలింగ్ సందర్భంగా నిందితులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.5,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

దర్యాప్తులో ప్రధాన నిందితుడు ఒడిశా రాష్ట్రంలోని సనతల ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద నుంచి సుమారు 500 గ్రాముల గంజాయిని రూ.5 వేలకుప కొనుగోలు చేసి ఖమ్మంకు తీసుకొచ్చినట్లు తేలింది. అందులో కొంత భాగాన్ని వినియోగించి, మిగిలిన గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ.500 చొప్పున విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు వెల్లడైంది.

నిందితులు ప్లాస్టిక్ బాంగ్ బాటిళ్లతో గంజాయి సేవించేందుకు సిద్ధమవుతుండగా పోలీసులు పట్టుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎన్‌డీపీఎస్ చట్టం–1985లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గంజాయి సరఫరా చేసిన ఒడిశాకు చెందిన నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్–100కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతుందని హెచ్చరించారు.

# మాదకద్రవ్య రహిత భారతదేశ నిర్మాణానికి సమష్టి కృషే కీలకం: తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు




న్యూఢిల్లీ, జులై 10:మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనకు చట్టాన్ని అమలు సంస్థలు, విద్యా సంస్థలు, సమాజం, పౌరులు సమన్వయంతో ముందుకు సాగాలని తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీ పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహించిన 'నషా ముక్త్ భారత్ అభియాన్' సమగ్ర అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అంతమొందించడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, సమష్టి కృషితోనే ఈ పోరాటంలో విజయం సాధించగలమని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ.. నిరంతర నిఘాతో పాటు టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 1908 ద్వారా ప్రజలు అందిస్తున్న సమాచారం రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్స్ నెట్‌వర్క్‌లను గుర్తించడానికి, వాటిని నిర్మూలించడానికి ఎంతగానో దోహదపడుతోందని శ్రీనివాసరావు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా దేశ యువతకు పెద్ద ముప్పుగా మారిందని, నిందితులు ముఖ్యంగా విద్యార్థులను, విద్యాసంస్థలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ బారిన పడకుండా ఉండేందుకు విద్యార్థుల లో, ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు.

నషా ముక్త్ భారత్ అభియాన్ మూడు ముఖ్యమైన స్తంభాలపై ఆధారపడి పనిచేస్తుందని శ్రీనివాసరావు వివరించారు. డ్రగ్స్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడం, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, వ్యసనపరులకు విముక్తి కలిగించి పునరావాసం కల్పించడం ఇందులో ప్రధానమైనవని పేర్కొన్నారు. మాదకద్రవ్య రహిత భారత స్వప్నాన్ని సాకారం చేసేందుకు పౌరులంతా అప్రమత్తంగా ఉంటూ, డ్రగ్స్ వ్యతిరేక చర్యలకు చురుగ్గా మద్దతు ఇవ్వాలని కోరారు.

అంతకుముందు పీఐబీ, సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కట్టుబడి ఉందని చెప్పారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఆరోగ్యకరమైన, సురక్షితమైన, మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. అవగాహన, నివారణ, సరైన నిర్ణయాలు తీసుకోవడమే డ్రగ్స్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు అత్యంత ప్రభావవంతమైన మార్గాలని ఆమె పేర్కొన్నారు. వ్యసనంతో పోరాడుతున్న వారికి అండగా నిలిచి, వారు గౌరవప్రదంగా తిరిగి సమాజంలో కలిసిపోయేలా సహాయం చేయాల్సిన ప్రాధాన్యతను ఆమె గుర్తుచేశారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ.. ఆన్‌లైన్, సైబర్ నేరాలతో పాటు డ్రగ్స్ వ్యసనం నేడు యువతకు, కుటుంబాలకు, దేశ భవిష్యత్తుకు పెద్ద సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, బలమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని, తోటివారిలో కూడా అవగాహన పెంచాలని ఆయన కోరారు.

ఈ ప్రచారంలో అందరూ చురుగ్గా పాల్గొని, ఇక్కడ తెలుసుకున్న విషయాలను తమ కుటుంబాలకు, సమాజానికి చేరవేయాలని వక్తలు కోరారు. తద్వారా నషా ముక్త్ భారత్ నిర్మాణ సమష్టి కృషిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల ఎవాల్యుయేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్టా, అధ్యాపకులు, విద్యార్థులు, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యాపేటకు రైల్వే లైన్ సాధించేదాకా పోరాటం: రైల్వే సాధన సమితి

నల్గొండ, జులై 10: సూర్యాపేట జిల్లాకు రైల్వే లైన్ విషయంలో జరుగుతున్న అన్యాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే సరిదిద్దాలని సూర్యాపేట రైల్వే సాధన సమితి డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి కన్వీనర్ దేగల జనార్దన్, కో–కన్వీనర్ రాచురి ప్రతాప్, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రంగా రెడ్డి, గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య మాట్లాడారు.

తొలుత ప్రతిపాదించిన హైదరాబాద్– సూర్యాపేట–ఖమ్మం రైల్వే మార్గాన్ని మార్చడం వల్ల జిల్లా ప్రజల ఆశలు దెబ్బతిన్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

సూర్యాపేట చారిత్రక, భౌగోళిక, వాణిజ్య పరంగా కీలకమైన జిల్లా కేంద్రంగా ఎదిగిందని, ప్రతిరోజూ పది మండలాల ప్రజలు విద్య, వైద్యం, వ్యాపారం, ఉద్యోగ అవసరాల కోసం ఇక్కడికి వస్తున్నారని తెలిపారు

. ఇలాంటి ప్రాధాన్యం ఉన్న జిల్లాకు ఇప్పటికీ రైల్వే సౌకర్యం లేకపోవడం అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారిందన్నారు. రైల్వే లైన్ ఏర్పడితే విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, కార్మికులతో పాటు సామాన్య ప్రజలకు కూడా ప్రయాణ, సరుకు రవాణా పరంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

ప్రస్తుతం ప్రతిపాదించిన మార్గాన్ని పునఃసమీక్షించి, మొదట ప్రకటించిన హైదరాబాద్–సూర్యాపేట–ఖమ్మం రైల్వే లైన్‌ను యథాతథంగా అమలు చేయాలని సమితి డిమాండ్ చేసింది.

రైల్వే లైన్ సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేస్తూ, సంతకాల సేకరణ, వినతిపత్రాల సమర్పణ, ప్రజా సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు, ప్రజాప్రతినిధుల ముట్టడులు వంటి ప్రజాస్వామ్య పోరాట కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది.

ఈ ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ, రైతు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు, జిల్లా ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరింది.

# విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కామారెడ్డి, జులై 10:విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందిన ఘటన బీర్కూర్ మండలం బైరాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై రాములు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీనివాస్ (45) అనే రైతు గురువారం గ్రామ శివారులోని తన పొలానికి నీళ్లు పారించడానికి వెళ్లాడు. బోరు వేయడానికి వెళ్లే క్రమంలో పొలం గట్టు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తు చేయి తగలడంతో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు.

అక్కడే ఉన్న ఓ గొర్రెల కాపరి చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రూ. 33 లక్షల విలువైన గంజాయి దహనం

ములుగు, జులై 10: ములుగు జిల్లాలో వివిధ కేసులలో పోలీస్‌శాఖ ద్వారా సీజ్ చేసిన రూ.33.50 లక్షల విలువైన 67 కిలోల ఎండు గంజాయిని గురువారం దహనం చేసినట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. న్యాయస్థానం అనుమతితో వరంగల్‌లోని కాకతీయ మెడివేస్ట్ యూనిట్‌లో ప్రత్యేక యంత్రాల ద్వారా పూర్తిగా దహనం చేసి నాశనం చేసినట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల సరఫరాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా ప్రజలు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచనున్నట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు.

# బీసీ హాస్టల్ వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కామారెడ్డి, జులై 10: కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండల కేంద్రంలో బీసీ హాస్టల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యానికి పాల్పడిన ఘటన గురువారం రోజున రాత్రి చోటుచేసుకుంది.

స్థానిక ఎస్ఐ పుష్పరాజు తెలిపిన వివరాల ప్రకారం.. బీసీ హాస్టల్‌లో ఉంటూ బాయ్స్ హై స్కూల్లో పదవ తరగతి చదువుతున్న కుమ్మరి రాఘవేందర్ అనే విద్యార్థి ఇటీవల వాళ్ల అత్తమ్మ చనిపోయి రెండు రోజులు అవుతుంది.

కాగా అదే బాధతో రబ్బర్లతో మెడకు ఉరి వేసుకోగా వెంటనే వార్డెన్ చూసి రాఘవేందర్‌ను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అతని ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



## మేడిగడ్డకు పోటెత్తుతున్న వరద .. 85 గేట్లుఎత్తి దిగువకు నీటి విడుదల



ములుగు, జులై 10: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న కాలేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి ) బరాజ్ కు వరద పోటెత్తుతుంది.

గురువారం బరాజ్ ఇన్‌ఫ్లో 70,140 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్ లోని మొత్తం 85 రేడియల్ గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని భారీ నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

## జిల్లాలో 80 శాతం ఓటరు వివరాల డిజిటలైజేషన్ పూర్తి

**–జూలై 14లోపు వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యం: కలెక్టర్ సుమిత్ కుమార్**

చిత్తూరు, జులై 10: జిల్లాలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం వేగంగా కొనసాగుతోందని, ఓటరు వివరాల డిజిటలైజేషన్ ఇప్పటికే 79.69 శాతానికి చేరుకుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూలై 14లోపు డిజిటలైజేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తిచేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారని చెప్పారు.

జిల్లాలో మొత్తం 13,40,126 మంది ఓటర్లకు గాను 13,39,675 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా 99.97 శాతం పంపిణీ పూర్తయిందన్నారు. ఇప్పటివరకు 10,67,946 ఫారాలు డిజిటలైజ్ చేయడంతో పురోగతి 79.69 శాతానికి చేరిందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా నగరిలో 84.02 శాతం, జి.డి.నెల్లూరులో 81.37 శాతం, పలమనేరులో 80.34 శాతం, పూతలపట్టులో 79.72 శాతం, చిత్తూరులో 76.71 శాతం, కుప్పంలో 76.18 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటివరకు 19,701 మంది మరణించిన ఓటర్లు, 8,344 మంది శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, 7,263 మంది ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే ఓటర్లుగా నమోదైన వారు, 789 మంది గైర్హాజరు, 108 ఇతర కేసులను గుర్తించినట్లు వెల్లడించారు. మొత్తం 36,205 మందిని అన్‌కలెక్టబుల్‌గా గుర్తించామని, తుది పరిశీలన అనంతరం ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

జిల్లాలో 1,511 మంది బీఎల్‌ఓలు విధులు నిర్వహిస్తున్నారని, గత 24 గంటల్లోనే 42,920 ఫారాలను డిజిటలైజ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఈ నెల 14న మరో సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

ఓటర్ల వివరాల్లో మార్పులు, సవరణలు అవసరమైన వారు ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిన 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌ఓ' సేవను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు కూడా ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించి నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తయ్యేలా సహాయపడాలని విజ్ఞప్తి చేశారు.

## రూ.22 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**–కుల, మత, పార్టీలు చూడకుండా పేదలకు అండగా కూటమి ప్రభుత్వం: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

అమరావతి, జులై 10:ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కుల, మత, పార్టీలు చూడకుండా పేదలకు అండగా నిలుస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం గుడివాడ పట్టణంలోని ఏలూరు రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయం ప్రజా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి నియోజకవర్గానికి చెందిన 29 బాధిత కుటుంబాలకు మంజూరైన రూ.22 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. గత 25 నెలల్లో గుడివాడ నియోజకవర్గానికి రూ.6.80 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆస్పత్రి ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరటనిస్తోందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గుడివాడ, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, కూటమి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నూతన వంతెన ప్రారంభించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



అమరావతి, జులై 10: కృత్తివెన్ను మండలం ఎండపల్లి గ్రామ శివారు గాంధీనగర్‌లో పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్ట్నర్‌షిప్ (పీ4) కార్యక్రమంలో భాగంగా నిర్మించిన నూతన వంతెనను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. గ్రామ ప్రజల సహకారంతో ఈ వంతెన నిర్మాణం పూర్తికాగా, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న పీ4 కార్యక్రమం ద్వారా ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జగన్నాథ రథయాత్రను విజయవంతం చేద్దాం

**– పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రవాణా, బి సి సంక్షేమశాఖ మంత్రి**

హైదరాబాద్, జులై 10:రోజు కరీంనగరం పురవీధుల్లో పెద్ద ఎత్తున జరిగే జగన్నాథ రథయాత్రకు భారీఏర్పాట్లు చేసేతున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బి సి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఈ రోజు జగన్నాథ రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ పూరీలో 16 జూలై రోజు జరిగే రథోత్సవం రోజున మన కరీంనగర్ పట్టణంలో కూడా నిర్వహించడం సంతోషకరమని అన్నారు. కరీంనగర్ పట్టణంలో ఐదవ సారి రథయాత్ర జరగడం, ప్రతి ఏటా భక్తుల ఆదరణ పెరగడం శుభ సూచకమని అన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక ఉపాధి, పరిశ్రమల శాఖ మంత్రి గడ్డం వివేక్, మునూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. జగన్నాథ రథయాత్ర నిర్వహణ కమిటీ అధ్యక్షులు కన్న కృష్ణ జరుగుతున్న ఏర్పాట్ల గూర్చి మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్: ఎల్ రాజభాస్కర్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, రాళ్లబండి గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చేనేత రంగంలో ఆవిష్కరణలు, సాంకేతికత ఆధారిత పరిష్కారాలను ప్రోత్సహించేందుకు 'హ్యాండ్లూమ్ హ్యాకథాన్ 2026' ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 10:భారతదేశ చేనేత రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ పరిధిలోని అభివృద్ధి కమిషనర్ (చేనేత) కార్యాలయం హ్యాండ్లూమ్ హ్యాకథాన్ 2026–"వీవింగ్ ఇన్నోవేషన్" పేరుతో ఒక జాతీయ స్థాయి పోటీని ప్రారంభించింది. సాంకేతికత, సరికొత్త డిజైన్లు, పారిశ్రామిక నైపుణ్యం, పర్యావరణ హిత పరిష్కారాలను చేనేత రంగానికి అనుసంధానించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ హ్యాకథాన్ ముగింపు వేడుక (గ్రాండ్ ఫినాలే) ఆగస్టు 1, 2026న ఐఐటీ ఢిల్లీలోని ఫౌండేషన్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ (ఎఫ్ఐటీటీ) వేదికగా జరగనుంది. ప్రాథమిక పరిశీలనలో ఎంపికైన జట్లు తమ ఆలోచనలను, పరిష్కారాలను ఇక్కడ ప్రదర్శిస్తాయి. విద్యా రంగం, పరిశ్రమలు, డిజైన్, సాంకేతికత, చేనేత రంగ నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి జ్యూరీ ఈ ప్రదర్శనలను పరిశీలించి విజేతలను ఎంపిక చేస్తుంది.

ఈ కార్యక్రమం గురించి కేంద్ర జౌళి శాఖ చేనేత విభాగం అభివృద్ధి కమిషనర్ డాక్టర్ ఎం బీనా మాట్లాడుతూ...

"భారతీయ యువత సృజనాత్మకతను, చేనేత రంగ సంప్రదాయ వారసత్వాన్ని ఒకే వేదికపైకి తీసుకురావడమే 'హ్యాండ్లూమ్ హ్యాకథాన్ 2026' ముఖ్య ఉద్దేశం. నేత కార్మికులు, విద్యార్థులు, డిజైనర్లు, సాంకేతిక నిపుణులు, వ్యాపారవేత్తలు, ఆవిష్కర్తలు కలిసికట్టుగా పనిచేసేందుకు ఈ కార్యక్రమం ఒక వేదికను అందిస్తుంది. చేనేత రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లను అధిగమించడానికి, అంతర్జాతీయ పోటీని తట్టుకోవడానికి, ఈ రంగం స్థిరమైన వృద్ధి సాధించడానికి అవసరమైన ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనడమే ఈ హ్యాకథాన్ లక్ష్యం".

చేనేత రంగానికి సంబంధించిన విస్తృతమైన అంశాల్లో వినూత్న పరిష్కారాలను ప్రోత్సహించేలా ఈ హ్యాకథాన్‌ను రూపొందించారు. ఉత్పత్తి, డిజైన్ ఆవిష్కరణల, సుస్థిరత, సర్క్యులారిటీ, డిజిటల్ సాంకేతికత, మార్కెట్ అవకాశాలు, బ్రాండింగ్, సరఫరా వ్యవస్థ సమర్థత, ఉత్పాదకత పెంపు, వ్యాపార వృద్ధి, సామాజిక ప్రభావం వంటి పలు అంశాలపై ఇందులో ప్రధానంగా దృష్టి పెడతారు.

సంప్రదాయ చేనేత రంగాన్ని దేశ ఆధునిక అంకుర సంస్థల వ్యవస్థతో మరింత బలోపేతంగా అనుసంధానించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. విభిన్న రంగాల నిపుణులు కలిసికట్టుగా సమస్యలను పరిష్కరించేందుకు ఇది మార్గం సుగమం చేస్తుంది.

ఈ జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు విభిన్న రంగాల వారికి అవకాశం కల్పించారు. శైలి, ఫ్యాషన్, డిజైన్, ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సాంకేతికత విభాగాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. వీరితో పాటు చేనేత కార్మికులు, కళాకారులు, పరిశోధకులు, అంకుర సంస్థలు, పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, రకరకాల నిపుణులు ఈ సవాల్‌లో భాగస్వాములు అయ్యేందుకు అర్హులు.

ఈ హ్యాకథాన్ కేవలం ఉత్తమ ఆలోచనలను గుర్తించడానికే పరిమితం కాలేదు. నిజ జీవితంలో అమలు చేయడానికి వీలుగా ఉండే ఆచరణీయమైన పరిష్కారాలను ఇది ఎంపిక చేస్తుంది. భాగస్వామ్య సంస్థల సహకారంతో వీటికి మార్గదర్శకత్వం, ఇంక్యుబేషన్, తదుపరి అభివృద్ధికి అవసరమైన పూర్తి మద్దతును అందిస్తారు. చేనేత రంగాన్ని ఆధునీకరించడం, అంతర్జాతీయ పోటీకి సిద్ధం చేయడం, దీర్ఘకాలిక మనుగడ సాగించేలా వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం అసలు లక్ష్యం.

సాంకేతికంగా బలోపేతమైన, పర్యావరణ హితమైన, అంతర్జాతీయ స్థాయి పోటీని తట్టుకోగల భారతీయ చేనేత రంగం కోసం ప్రతిభావంతులంతా ఈ హ్యాకథాన్‌లో పాల్గొనాలని అభివృద్ధి కమిషనర్ (చేనేత) కార్యాలయం పిలుపునిచ్చింది. ఈ రంగంలో వినూత్న మార్పులు తీసుకువచ్చేందుకు విద్యార్థులు, ఆవిష్కర్తలు, డిజైనర్లు, పారిశ్రామికవేత్తలు, పరిశోధకులు, అంకుర సంస్థలు, చేనేత నిపుణులు తమ వంతు కృషి చేయాలని కోరింది. భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ కార్యాలయం దేశంలో చేనేత రంగానికి సంబంధించిన ప్రచారం, అభివృద్ధి, కార్మికుల సంక్షేమాన్ని నిర్వహించే అత్యున్నత సంస్థ. ప్రభుత్వ విధానాల రూపకల్పన, అభివృద్ధి కార్యక్రమాలు, మార్కెటింగ్ ప్రోత్సాహక, సంస్థాగత మద్దతు ద్వారా భారతీయ చేనేత వస్త్రాల పోటీతత్వాన్ని పెంచడానికి ఇది నిరంతరం కృషి చేస్తుంది.

## ఆరోగ్యకరమైన, క్రమశిక్షణ గల యువతపై దృష్టి సారించే 'నషా ముక్త్ భారత్ అభియాన్' దేశ నిర్మాణంలో కీలక కార్యక్రమం

**–కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్**

న్యూఢిల్లీ, జులై 10:దేశంలో మాదకద్రవ్యాలను అరికట్టేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆగస్టు 15, 2020న నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ)ను ప్రారంభించింది. ఈ విషయంలో ఉమ్మడి కార్యాచరణ అవసరాన్ని గుర్తిస్తూ.. డ్రగ్స్ నివారణ, అంచనా, చికిత్స, పునరావాసం, తదుపరి సంరక్షణ, ప్రజలకు సమాచారాన్ని చేరవేయటం, సమాజంలో అవగాహన కల్పించటంతో సహా వివిధ కార్యక్రమాలను ఈ మంత్రిత్వ శాఖ సమన్వయం చేస్తుంది.

భారతదేశంలో మాదకద్రవ్యాల వ్యసనం.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యక్తులు, కుటుంబాలు, సమాజాలపై ప్రభావం చూపుతున్న నిశ్శబ్ద సంక్షోభం. దీన్ని అరికట్టేందుకు ఎన్ఎంబీఏ ప్రారంభంలో 272 ప్రభావిత జిల్లాలను లక్ష్యంగా చేసుకుని, ఆ తర్వాత దేశవ్యాప్తంగా విస్తరించింది. దీనిద్వారా 7.81 కోట్లకు పైగా యువకులు, 5.24 కోట్ల మంది మహిళలు, 17 లక్షల విద్యాసంస్థలతో కలిపి మొత్తం 23 కోట్లకు పైగా ప్రజలను చేరుకుంది.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. దేశంలోని యువత ఆరోగ్యంగా, క్రమశిక్షణతో ఉండేలా చూసేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్ అత్యంత కీలకమైన దేశ నిర్మాణ కార్యక్రమంగా పనిచేస్తుందన్నారు. భారతదేశాన్ని మాదకద్రవ్యాల రహిత దేశంగా మార్చేందుకు నార్కోటిక్స్ బ్యూరో వంటి నియంత్రణ సంస్థలు, రాష్ట్ర, జిల్లా ప్రభుత్వాలు, పోలీసు శాఖ, ఎన్జీవోలు, ఆసుపత్రులు మొదలైనవి సమన్వయంతో పనిచేసేలా ఎన్ఎంబీఏ దోహదపడిందని చెప్పారు.

మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు సాక్ష్యాధారాల ఆధారిత విధానాన్ని బలోపేతం చేసేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిష్ఠాత్మక ప్రచార కార్యక్రమమని సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయమంత్రి శ్రీ రామ్‌దాస్ అథవాలే తెలిపారు. భారతదేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా మార్చాలనే ఉమ్మడి లక్ష్యం కోసం.. యువత భాగస్వామ్యంతో సంబంధిత విభాగాలను ఏకం చేస్తూ సమగ్రంగా ఈ అభియాన్ విధానం సాగుతుందని ఆయన తెలిపారు.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయమంత్రి శ్రీ బి.ఎల్.వర్మ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణాన్ని లక్ష్యంగా పెట్టుకున్న జాతీయ కార్యక్రమం నషా ముక్త్ భారత్ అభియాన్ అని తెలిపారు. ఈ ఉద్యమంలో యువత, మహిళలు, సమాజంలోని ఇతర సభ్యులను క్రియాశీలకంగా భాగస్వాములను చేస్తున్నట్లు.. ముఖ్యంగా ఉన్నత విద్యా సంస్థలు, యువజన క్లబ్బులు, మహిళా సంఘాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. డ్రగ్స్ వ్యసనం వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రతి పౌరుడికి అవగాహన కల్పించటమే ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమని శ్రీ వర్మ చెప్పారు. ప్రాథమిక దశలోనే డ్రగ్స్ వాడకాన్ని నివారించటం, సమాజ భాగస్వామ్యం ద్వారా ఈ ఉద్యమం మరింత ఆరోగ్యకరమైన, సంతోషకరమైన సమాజాన్ని నిర్మిస్తుందని, మాదకద్రవ్యాల మహమ్మారిని అంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఎన్ఎంబీఏ ప్రధాన వాటాదారులు, లబ్ధిదారులు.. యువత, మహిళలు, పిల్లలు, విద్యా సంస్థలు, పౌర సమాజం, యావత్ సమాజం. ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి దేశవ్యాప్తంగా విస్తృత శ్రేణి కార్యక్రమాలు జరిగాయి. ఇవి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను, వాటాదారులను భాగస్వాములను చేశాయి. మాదకద్రవ్యాల వ్యసనం సమస్యపై గతంలో లాగా కేవలం సంస్థల ప్రమేయానికే పరిమితం కాకుండా ఇప్పుడు సమాజం మొత్తాన్ని భాగస్వామ్యం చేసేలా మార్పు వచ్చింది. రాష్ట్రాలు, జిల్లాలు, ఇతర వాటాదారులు ఈ అభియాన్‌ను బాధ్యతగా స్వీకరించటంతో ఇది ప్రజా ఉద్యమంగా మారింది.

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోని వివిధ విభాగాలు, వాటాదారులతో కుదుర్చుకున్న భాగస్వామ్యాల ద్వారా ఎన్ఎంబీఏ లక్ష్యం క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలైంది. ఈ భాగస్వామ్యాలు పౌరుల్లో బాధ్యతను పెంచి, మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించి సామాజిక వివక్షను తగ్గించాయి. అంగీకారాన్ని, జవాబుదారీతనాన్ని పెంపొందించాయి.

మాదకద్రవ్యాల వినియోగం మితిమీరి, వ్యసనంగా మార్చుకోవటం వల్ల సామాజిక, మానసిక, శారీరక సమస్యలు ఎదురవుతాయి. ఇది ఆరోగ్యాన్ని క్షీణించేలా చేయటమే కాక, పెను సామాజిక సమస్యగా మారింది.

డ్రగ్స్ వ్యసనానికి గురైన బాధితులకు సాయం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఉద్దేశించిన కార్యక్రమమే ఎన్ఎంబీఏ ప్రతిజ్ఞ. ప్రజలు డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా వారిలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను, సామాజిక బాధ్యతను పెంపొందించటం ఈ ప్రతిజ్ఞ ఉద్దేశం. ఉమ్మడి లక్ష్యం కోసం భాగస్వాములందరూ కలిసి పనిచేసేలా ఐక్యతను, నిబద్ధతను ప్రోత్సహించటం దీని లక్ష్యం. ఈ ప్రతిజ్ఞ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత క్రియాశీలకంగా పాల్గొనేలా చేస్తుంది.

## సముద్రంలో చేపలు పట్టే వృత్తికి సంబంధించిన అధికార పత్రాల జారీ...

**– జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్**



న్యూ ఢిల్లీ, జులై 10:సముద్ర మధ్యం (హైసీస్)లో సుస్థిర ప్రాతిపదికన చేపలు పట్టేందుకు అధికార పత్రాలను జారీ చేయడానికి సంబంధించిన జాతీయ కార్యక్రమాన్ని ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ భువనేశ్వర్‌లో ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 'ఒడిశా డీప్ సీ ఫిషింగ్ మిషన్ డాక్యుమెంటు'ను కూడా విడుదల చేశారు. దీంతో పాటు, దేశవ్యాప్తంగా పది ఫిష్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ల (ఎఫ్‌పీఓస్)కు, మత్స్యకారులకు సముద్ర మధ్యంలో చేపల వేటకు ఉద్దేశించిన అధికార పత్రాల్ని ఆయన అందజేశారు.

సభను ఉద్దేశించి ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ, ఈ కార్యక్రమం భారత సముద్ర వాణిజ్య నౌకాయానంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందని వర్ణించారు. దీంతో భారతీయ మత్స్యకారులు దేశంలో ప్రత్యేక ఆర్థిక మండలం (ఈఈజడ్), సముద్ర మధ్యంలో ఉండే విశాల వనరులను నిరంతర ప్రాతిపదికన సద్వినియోగ పరుచుకోగలుగుతారని ఆయన అన్నారు. మత్స్య పోషణ రంగంలో వృద్ధి, నిరంతరత్వం, సౌభాగ్యాల తాలూకు నవ శకాన్ని మత్స్యకారులకు అందించాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకొన్న ఉమ్మడి సంకల్పాన్ని ఈ కార్యక్రమం చాటుతోందని కూడా ఆయన అన్నారు.

భారత్‌కు 11,000 కిలోమీటర్ల కన్నా ఎక్కువ పొడవున విస్తరించిన కోస్తాతీరప్రాంతం ఉందని, దీనిలో ప్రత్యేక ఆర్థిక మండలమే (ఈఈజడ్) సుమారు 24 లక్షల చ.కి.మీ. ఉందని, ఇది అపార జల వనరులకు నిలయమని, వీటిని ఇంతవరకు పూర్తి స్థాయిలో సద్వినియోగపరచలేదని ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. సాంప్రదాయికంగా చూస్తే చేపలు పట్టే కార్యకలాపాలు తీరానికి దగ్గరగానే ఉంటాయని, అయితే భారతీయ మత్స్యకారులు ట్యూనా వంటి అధిక విలువ కలిగిన చేపల జాతుల నిరంతర వేట కోసం లోతయిన సముద్ర జలాల్లోకి ఆత్మవిశ్వాసంతో వెళ్లేందుకు కొత్త ప్రాథమిక ప్రణాళిక వీలు కల్పిస్తుందని ఆయన అన్నారు.

భారత్ మత్స్య పరిశ్రమ శరవేగంగా వృద్ధి చెందుతోందని ఉపరాష్ట్రపతి ప్రస్తావిస్తూ, భారత్ ఇవాళ ప్రపంచంలో చేపల ఉత్పాదనలో రెండో అతి పెద్ద ఉత్పాదక దేశంగా పేరు తెచ్చుకుందని, ప్రపంచంలోని మత్స్య ఉత్పాదనల్లో దాదాపు 8 శాతం మన దేశమే అందిస్తోందని అన్నారు. మత్స్యకారులు, మత్స్య పాలకులు కలిపి దాదాపు 3 కోట్ల మందికి జీవనోపాధిని ఈ రంగం కల్పిస్తోందని, సముద్ర ఆహారోత్పత్తుల ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరంలో రూ.73,000 కోట్లను మించాయని తెలిపారు. 'హై సీస్ (సముద్ర మధ్యం) కార్యక్రమం' భారత్ ఎగుమతి సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయడమే కాక, దీంతో చేపలను పట్టే, శుద్ధి చేసే (ప్రాసెసింగ్), ఉష్ణోగ్రతను నియంత్రించే వ్యవస్థను జత పరిచిన నిలవ సదుపాయాలు (కోల్డ్ చైన్), రవాణా, ప్యాకేజింగ్, ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ, ఎగుమతి సేవల్లో ఉద్యోగావకాశాలు లభించగలవన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు.

అధికార పత్రాల (ఆథరైజేషన్ లెటర్స్) జారీ ప్రక్రియలో మత్స్య సహకార సంఘాలు, మత్స్య రైతు ఉత్పాదన సంస్థలు, భారతీయ మత్స్యకారులకు కొత్త ప్రాథమిక ప్రణాళిక ప్రాధాన్యాన్ని ఇస్తుందని ఉపరాష్ట్రపతి అన్నారు. ఈ కార్యక్రమం కోస్తా తీర ప్రజలకు సాధికారతను కల్పించే దిశగా తీసుకున్న ఒక కీలక నిర్ణయమని ఆయన అన్నారు. ఉమ్మడి ప్రయత్నాలతో మత్స్య పోషణ రంగంలో పెనుమార్పును తీసుకు రావడం సాధ్యపడుతుందని ఉపరాష్ట్రపతి స్పష్టంచేశారు.

చేపలు పట్టడం ఒక నైతిక బాధ్యత అని ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్ అన్నారు. ఆర్థిక ప్రగతి, సముద్ర వనరుల సంరక్షణ ఒకదానితో మరొకటి పరస్పర ఆధారితమై ముందుకు సాగాలని ఆయన అన్నారు. డిజిటల్ అధికృత వ్యవస్థలు, నౌకల ట్రాకింగు, అంతర్జాతీయ ధ్రువపత్రాల ప్రక్రియ, చట్టవిరుద్ధ, అనధికార, అనియంత్రిత పద్ధతుల్లో చేపల వేటకు వ్యతిరేకంగా కఠిన చర్యలను తీసుకోవలసిన అవసరం ఉందని స్పష్టం చేశారు. చేపలు పట్టే వృత్తిని విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, నూతన ఆవిష్కరణలు, అంతర్జాతీయ అవకాశాలపై ఆధారపడిన ఆధునిక వృత్తిగా చూడాలంటూ ఉపరాష్ట్రపతి యువతను కోరారు. 2047 కల్లా వికసిత్ భారత్ విజనును సాధించడానికి జ్ఞానాన్ని, సాంకేతికతని, ఆర్థిక సహాయాన్ని చేపలు పట్టే వృత్తిలో ఉన్న వర్గాలకు అందించాల్సిందిగా సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఒడిశా గవర్నరు శ్రీ హరి బాబు కంభంపాటి, ఒడిశా ముఖ్యమంత్రి శ్రీ మోహన్ చరణ్ మాఝీ, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్, కేంద్ర విద్యా శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్, కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, పంచాయతీ రాజ్ శాఖ సహాయ మంత్రి ప్రొఫెసర్ ఎస్.పి. సింగ్ బఘేల్, ఒడిశా మత్స్య, ఎమ్ఎఎమ్ఈ శాఖ మంత్రి శ్రీ గోకులానంద మల్లిక్, కేంద్ర ప్రభుత్వానికీ, రాష్ట్ర ప్రభుత్వానికీ చెందిన సీనియర్ అధికారులు, మత్స్య సంస్థల ప్రతినిధులు, మత్స్యకారుల సంఘాల ప్రతినిధులతో పాటు ఇతర ఆసక్తిదారులు ఉన్నారు.

## తిరుమల క్షేత్రం స్వర్గాన్ని తలపిస్తోంది

**- కేంద్ర మంత్రి మాంజీ**

తిరుపతి, జులై 10:కేంద్ర మంత్రి జితన్‌రామ్ మాంజీ ,రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం తిరుమల లో శ్రీవారిని దర్శించు కున్నారు. మూలవిరాట్ దర్శనం తరువాత పండితులు మంత్రులకు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం బయట కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడారు.

స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని, తిరుమల క్షేత్రం స్వర్గాన్ని తలపిస్తోందని పేర్కొన్నారు. క్షేత్ర నిర్వహణ అద్భుతంగా ఉందని, ఇక్కడ పనిచేసే పండితులు, అర్చకులు, అధికారులు, సిబ్బంది పనితీరును ప్రశంసించారు. పరిసరాల పరిశుభ్రత బాగుందన్నారు.

శిలాతోరణం వరకు భక్తుల క్యూ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. కంపార్టుమెంట్లు నిండి శిలాతోరణం వరకు క్యూలైన్‌లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని ఆలయ అధికారులు వివరించారు. గురువారం 70,141 మంది భక్తులు దర్శించుకోగా 33,821 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 4.23 కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు.

# రక్షణ, భద్రతా రంగాల్లో సహకారంపై ఇండియా-ఆస్ట్రేలియా సంయుక్త ప్రకటన

న్యూఢిల్లీ, జులై 10:భారత్, ఆస్ట్రేలియా ప్రధానమంత్రులమైన మేం.. మా మధ్య బలపడుతున్న ద్వైపాక్షిక సంబంధాల ద్వారా ఇరుదేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే సంకల్పంతో ఏకమై.. ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛా, శాంతియుత, స్థిరమైన, సుసంపన్నమైన ప్రాంతంగా మార్చాలన్న ఉమ్మడి ఆశయంతో రక్షణ, భద్రతా సహకారంపై సంయుక్త ప్రకటనకు కట్టుబడి ఉంటామని తెలియజేస్తున్నాం.

ఇరుదేశాల మధ్య 2020లో ఏర్పాటైన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం (సీఎస్‌పీ) ప్రాముఖ్యతను గుర్తించాం. సీఎస్‌పీ ప్రారంభమైనప్పటి నుంచి రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత వేగవంతమై, ఆర్థిక బంధాలు బలోపేతమయ్యాయి. ఇరుదేశాల ప్రజల మధ్య సన్నిహిత సంబంధాలు మరింత బలపడ్డాయి. క్వాడ్, ఇతర సంస్థల వంటి ప్రాంతీయ వేదికల ద్వారా ఇతర భాగస్వాములతో సహా ద్వైపాక్షికంగా, పలు విధాలుగా సన్నిహిత సంబంధాలు ఇరుదేశాలకు ప్రయోజనం చేకూర్చి, మన ఉమ్మడి ప్రాంత భద్రత, అభివృద్ధికి దోహదపడతాయి.

2009 నాటి భారత్- ఆస్ట్రేలియా ఉమ్మడి రక్షణ సహకార ప్రకటన ద్వారా ఇరుదేశాల భాగస్వామ్యంలో సాధించిన గొప్ప పురోగతిని మేం గుర్తుచేసుకున్నాం. విదేశాంగ మంత్రుల వ్యవస్థీకృత చర్చలు (ఎఫ్ఎంఎఫ్‌డీ), 2+2 విదేశాంగ, రక్షణ మంత్రుల చర్చలు.. రక్షణ మంత్రుల చర్చల వంటి వివిధ ద్వైపాక్షిక విధానాల ద్వారా ఈ భాగస్వామ్యానికి సహకరించినందుకు అభినందనలు తెలియజేస్తున్నాం.

భౌగోళికంగా నెలకొన్న అనిశ్చితి, ప్రాంతీయ శాంతి, భద్రతలకు ఎదురవుతున్న ముప్పు పట్ల మేం ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. సంబంధిత పక్షాలన్నీ శాంతియుతంగా పని చేయాలని కోరుతున్నాం. ఎలాంటి బెదిరింపులు, బలప్రయోగానికి పాల్పడకుండా అంతర్జాతీయ చట్టాలకు లోబడి వివాదాలను పరిష్కరించుకోవాలని పిలుపునిస్తున్నాం.

అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండే వ్యవస్థ, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాంతీయ సమగ్రతను గౌరవించటం, 1982 ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందానికి (యూఎన్‌సీఎల్ఓఎస్)కు కట్టుబడి ఉండటం ద్వారా సముద్ర ప్రయాణాలు, విమాన ప్రయాణాలు స్వేచ్ఛగా, సురక్షితంగా సాగటం.. సమర్థవంతమైన, సమ్మిళిత, పారదర్శకమైన సంస్థల మద్దతుతో ఇండో పసిఫిక్ ప్రాంతాన్ని స్వేచ్ఛా, శాంతియుత, స్థిరమైన, సంపన్నమైన ప్రాంతంగా మార్చేందుకు నిబద్ధతను తెలియజేస్తున్నాం.

ఆయా ప్రాంతాల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్ (ఐఓఆర్ఏ), ఆసియాన్, ఆసియాన్ కేంద్రీకృత ప్రాంతీయ వ్యవస్థ, పసిఫిక్ ఐలాండ్స్ ఫోరమ్ (పీఐఎఫ్)లకు మేం మద్దతిస్తున్నాం.

మారుతున్న వ్యూహాత్మక పరిస్థితులకు అనుగుణంగా ఇరుదేశాల భాగస్వామ్యం మరింత వృద్ధి చెందాల్సిన అవసరాన్ని గుర్తించాం. ఇందులో భాగంగానే అత్యాధునిక, సమగ్ర, అగ్రశ్రేణి రక్షణ, భద్రతా రంగాల్లో ఉమ్మడి భాగస్వామ్యాన్ని వేగవంతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. మన వ్యూహాత్మక ప్రయోజనాల పరస్పర ఆసక్తిని ప్రతిబింబించేలా వ్యూహాత్మక వినిమయాన్ని బలోపేతం చేయటానికి, క్రమం తప్పకుండా మంత్రిత్వ స్థాయి చర్చల నిర్వహణను మేం కొనసాగిస్తాం. ఉమ్మడి శక్తిని పెంపొందించుకునేందుకు రక్షణ, భద్రతా రంగాల సహకారంలో దీర్ఘకాలిక దృక్పథాన్ని మనం గుర్తిస్తున్నాం. ఈ పరస్పర సహకారం ఇరుదేశాల భద్రతకు దోహదపడటమే కాక ప్రాంతీయ శాంతి, భద్రతలకు కూడా తోడ్పడుతుంది.

రక్షణ, భద్రత, ఆర్థిక ప్రయోజనాలకు సముద్ర రంగం కీలకమని మేం గుర్తిస్తున్నాం. సముద్ర భద్రతా సహకారాన్ని మరింత పటిష్ఠంగా, అధునాతనంగా, నిరంతరాయంగా కొనసాగిస్తాం. భారత్- ఆస్ట్రేలియా సముద్ర భద్రతా సహకార రోడ్‌మ్యాప్ ద్వారా ఈ సముద్ర సహకారాన్ని మేం మరింత బలోపేతం చేస్తాం.

పరిశ్రమల అనుసంధానం, భాగస్వామ్యాల పెంపుదల, సరఫరా వ్యవస్థలో స్థిరత్వాన్ని బలోపేతం చేయటం ద్వారా ఇరుదేశాల రక్షణ పరిశ్రమలకున్న ఎదుగుదల సామర్థ్యాన్ని అందిపుచ్చుకుంటాం. మన రక్షణ ఆవిష్కరణల వ్యవస్థల మధ్య సహకారాన్ని మరింత పటిష్ఠం చేస్తాం. అధునాతన రక్షణ విజ్ఞాన, సాంకేతిక రంగాల్లో కలిసి పనిచేసేందుకు అవసరమైన ఒప్పందాలను కుదుర్చుకుంటాం.

ఘర్షణల నివారణలో, సహాయక, పునరావాస చర్యలను తీసుకోవటంలో, శాశ్వత శాంతి స్థాపనలో మహిళల క్రియాశీలక భాగస్వామ్యాన్ని, నాయకత్వాన్ని పెంపొందించేందుకు మేం కృషి చేస్తాం. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో లింగ సమానత్వాన్ని కాపాడేందుకు, మహిళలు, శాంతి, భద్రత అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు మా నిబద్ధతను తెలియజేస్తున్నాం.

ప్రాంతీయ ఆర్థిక వృద్ధి, స్థిరత్వాన్ని పెంపొందించేందుకు ద్వైపాక్షికంగా, ఇతర భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు మేం కట్టుబడి ఉన్నాం. క్లిష్టమైన ఖనిజాలు, స్వచ్ఛమైన ఇంధన సాంకేతికతలతో సహా... మరింత వైవిధ్యభరితమైన, స్థిరమైన సరఫరా వ్యవస్థలను, కీలకమైన మౌలిక సదుపాయాలను, అనుసంధానాన్ని మేం అభివృద్ధి చేస్తాం.

సురక్షితమైన, స్థిరమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం ఉమ్మడి దార్శనికతకు అనుగుణంగా సాంకేతిక వ్యవస్థను రూపొందించేందుకు మనం కలిసి పనిచేస్తాం. ఆస్ట్రేలియా-ఇండియా పార్టనర్‌షిప్ ఆన్ సైబర్, క్రిటికల్ టెక్నాలజీస్ అండ్ సప్లై చెయిన్స్ ద్వారా సైబర్ భద్రత, కీలకమైన, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక సహకారం, సమాచార మార్పిడి వ్యవస్థల సామర్థ్యాన్ని వినియోగించుకునేందుకు మనం కలిసికట్టుగా కృషి చేస్తాం. వ్యూహాత్మక సాంకేతికతలపై సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాం.

మా ప్రాంతంలోని ఉగ్రవాద ముప్పు, ఉగ్రవాద సంస్థలు, వాటికి సంబంధించిన వ్యక్తుల సమాచారాన్ని పంచుకునేందుకు మేం కట్టుబడి ఉన్నాం. హింసాత్మక తీవ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు వివిధ రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంపొందించుకునే అవకాశాలను అన్వేషిస్తాం.

అక్రమ వలసలు, మానవ అక్రమ రవాణా, స్మగ్లింగ్ నివారణపై పరస్పర సహకారానికి వీలుగా 2023లో కుదుర్చుకున్న వలసలు, రవాణా భాగస్వామ్య ఒప్పందం ప్రకారం సహకారాన్ని కొనసాగిస్తాం. అంతర్జాతీయ వ్యవస్థీకృత నేరాలను అణచివేయటానికి కూడా సహకారాన్ని కొనసాగిస్తాం.

అణ్వాయుధాలు లేని ప్రశాంతమైన ప్రపంచాన్ని మేం కాంక్షిస్తున్నాం. ఇందుకోసం అణ్వాయుధాల వ్యాప్తిని నిరోధించటానికి పక్షపాతం లేకుండా ప్రపంచవ్యాప్తంగా సంపూర్ణంగా, ధ్రువీకరించదగిన రీతిలో అణ్వాయుధ నిర్మూలనకు కట్టుబడి ఉంటామని మేం స్పష్టం చేస్తున్నాం.

ఇండో-పసిఫిక్ మహాసముద్రాల ప్రత్యేక కార్యక్రమం (ఐపీఓఐ) ద్వారా ఇతర భాగస్వాములతో సహకారాన్ని కొనసాగించేందుకు, త్రైపాక్షిక సహకార వ్యవస్థలతో కలిసి పనిచేసేందుకు మేం కట్టుబడి ఉన్నాం. స్వేచ్ఛా, స్థిరమైన, శాంతియుతమైన, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణ లక్ష్యం కోసం సామర్థ్యాలను, పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవటానికి అమెరికా, జపాన్ దేశాలతో సహకారాన్ని మేం మరింత విస్తరిస్తాం.

ప్రాంతీయ శాంతి, భద్రత, సుసంపన్నత, స్థిరత్వం పట్ల ఉమ్మడి నిబద్ధతను గుర్తిస్తూ... వేగవంతమైన, సమన్వయంతో కూడిన, స్థిరమైన విపత్తు ప్రతిస్పందన కోసం మానవతా సహాయం, విపత్తు ఉపశమనం (హెచ్ఏడీఆర్) రంగంలో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు మేం కట్టుబడి ఉన్నాం. దీని కోసం పలు మార్గాల ద్వారా మేం సహకారాన్ని పెంపొందించుకుంటాం.

ఇతర దేశాల్లో ప్రాంతీయ, ప్రపంచవ్యాప్త తరలింపు చర్యలకు మద్దతివ్వటంతో పాటు విపత్తులు, సంక్షోభాల సమయంలో అత్యవసర ప్రణాళికలను పంచుకోవటం, ఉమ్మడిగా స్పందించటం, సమన్వయం కోసం అవకాశాలను అన్వేషించేందుకు మేం కట్టుబడి ఉన్నాం.

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్ఫూర్తితో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వానికి మద్దతుగా ఈ ప్రతిష్ఠాత్మక కార్యాచరణను అమలు చేసేందుకు మేం కట్టుబడి ఉన్నాం.

# కోహెడలో చేపల మెగా మార్కెట్

**-కోహెడలో దేశంలోనే తొలి ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు శంకుస్థాపన**
**-రూ.47.03 కోట్లతో ఆధునిక చేపల మార్కెట్ నిర్మాణం..**
**-కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ సదుపాయాలు**
**-సుమారు 5 వేల మందికి ఉపాధి..**
**-తెలంగాణ చేపలకు అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు**
**-హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



హైదరాబాద్, జులై 10:రంగారెడ్డి జిల్లా కోహెడలో దేశంలోనే తొలి అంతర్గత ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆధునిక మార్కెట్‌కు మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, తెలంగాణ మత్స్యరంగాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేపలకు విలువను పెంచడంతో పాటు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ చేసేలా ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ మార్కెట్‌లో అత్యాధునిక శీతల గిడ్డంగులు (కోల్డ్ స్టోరేజీలు), చేపల శుద్ధి మరియు ప్రాసెసింగ్ యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, నిల్వ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో చేపల నాణ్యతను కాపాడుతూ ఎగుమతులకు అనువైన విధంగా ఉత్పత్తులను సిద్ధం చేసే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.

ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని మంత్రి వెల్లడించారు. అలాగే తెలంగాణలో ఉత్పత్తి అయ్యే చేపలకు ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మత్స్యరంగాన్ని ఆధునికీకరించడంతో పాటు రైతులు, మత్స్యకారులకు మెరుగైన మార్కెటింగ్ వేదిక కల్పించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో మత్స్యరంగం వాటాను మరింత పెంచే దిశగా ఈ మార్కెట్ ఒక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

## శ్రీశైలం గిరి ప్రదక్షిణకు శ్రీకారం

**-మామహేశ్వర క్షేత్రం నుంచి బయలుదేరిన ఆలయ చైర్మన్, పాలకమండలి సభ్యులు**

అచ్చంపేట, ఆంధ్రప్రభ : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండలం, రంగాపురం గ్రామంలోని ప్రసిద్ధ ఉమామహేశ్వర క్షేత్రం నుంచి శ్రీశైలం గిరి ప్రదక్షిణ యాత్ర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డి, కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస రావు, ప్రధాన అర్చకులు వీరయ్య శాస్త్రి, , ఆలయ పాలకవర్గ కమిటీ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో యాత్రకు బయలుదేరారు. గిరి ప్రదక్షిణ మూడు రోజుల పాటు కొనసాగనుంది.

యాత్రలో భాగంగా తొలుత శ్రీశైలం మహాక్షేత్రంలో మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం త్రిపురాంతకం, జ్యోతి సిద్ధవటం, అలంపురం పుణ్యక్షేత్రాలను సందర్శించి చివరగా ఉమామహేశ్వర క్షేత్రానికి చేరుకోవడంతో గిరి ప్రదక్షిణ ముగియనుంది.

# సైబర్ భద్రత.. కీలక సాంకేతికతలు.. సరఫరా వ్యవస్థలపై ఆస్ట్రేలియా-భారత్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ, జులై 10:భారత్-ఆస్ట్రేలియా మధ్య సైబర్ రంగంతోపాటు కీలక సాంకేతిక పరిజ్ఞానాలలో ఒక శాశ్వత భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. రెండు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, సైబర్-తదాధారిత కీలక సాంకేతిక సహకారం చట్రంపై 2020 నాటి ఒప్పందం సహా రెండు దశాబ్దాల సంయుక్త పరిశోధన, కార్యాచరణ సమన్వయం, విధానపరమైన భాగస్వామ్యాల ప్రాతిపదికన తాజా ఒప్పందం ఖరారైంది.

దేశ ఆర్థిక వృద్ధికి చోదక శక్తులైన సరఫరా వ్యవస్థలు, కీలక సాంకేతికతలు, సైబర్ భద్రత రంగాలు జాతీయ భద్రతలోనూ కీలకమని రెండు దేశాలూ గుర్తించాయి. దీంతోపాటు విలువలు, ప్రపంచ ప్రమాణాల రూపకల్పనకు అవి తోడ్పడతాయని గ్రహించాయి. ఈ నేపథ్యంలో స్నేహ సంబంధాల పునాది ఆధారంగా “సైబర్, కీలక సాంకేతికతలు-సరఫరా వ్యవస్థల భాగస్వామ్యం” (పీఏసీటీఎస్-ప్యాక్ట్స్) కింద 2020 నాటి చట్రం స్థానంలో ద్వైపాక్షిక ప్రయోజనాలను తాజా ఒప్పందం ద్వారా మరింత ఉన్నతీకరించాలని సంకల్పించాయి.

జాతీయ-ప్రాంతీయ భద్రతలో ఉమ్మడి ప్రయోజనాలకు మద్దతు, భాగస్వాములకు మరిన్ని డిజిటల్ సదుపాయాల సౌలభ్యం, కీలక సరఫరా వ్యవస్థలకు పునరుత్థాన సామర్థ్యం కల్పన, ప్రపంచ సైబర్ భద్రత పునరుత్థాన సామర్థ్యం పెంపు తదితరాలకు ‘ప్యాక్ట్స్’ మద్దతిస్తుంది. ఈ భాగస్వామ్యం కింద ఉభయ దేశాల కృషిలోని ప్రతి దశలోనూ భద్రత, రక్షణ, పునరుత్థాన సామర్థ్యం, సార్వజనీనత, ఉమ్మడి ప్రజాస్వామ్య విలువలకు సముచిత స్థానం ఉంటుంది. తద్వారా బాధ్యతాయుత సాంకేతిక అగ్రగాములుగా కొనసాగడంపై రెండు దేశాల నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలుస్తుంది. ఒక సమగ్ర ఏకీకృత వ్యూహాత్మక దృష్టి కింద ఈ కృషి క్రమబద్ధీకరణ ద్వారా 5 సహకార మూలస్తంభాల ద్వారా లక్షిత కార్యకలాపాల నిర్వహణకు వీలు కలుగుతుంది.

పరస్పరం ముడిపడిన ప్రతి మూలస్తంభం కింద ప్రైవేట్ రంగం, విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు, ప్రభుత్వ వ్యవస్థల మధ్య సహకారానికి మద్దతుపై అందుబాటులోగల అవకాశాలను, నిర్దిష్ట ప్రాజెక్టులను భారత్-ఆస్ట్రేలియా గుర్తిస్తాయి. దీంతో ప్రభుత్వాల మధ్య సహకార విస్తృతి సహా నవ్య సాంకేతికతలలో రెండువైపులా పెట్టుబడులు పెరుగుతాయి. మరోవైపు మేధా సంపత్తిని ఆర్థిక వృద్ధికి దోహదం చేసే ఉత్పత్తులుగా మార్చడంలో మద్దతిస్తుంది.

రెండు దేశాల్లో విస్తరిస్తున్న సాంకేతిక పరిశ్రమలకు చేయూతనిస్తూ సురక్షిత, పటిష్ట, విశ్వసనీయ సరఫరా వ్యవస్థల కోసం ఆస్ట్రేలియా-భారత్ సంయుక్తంగా కృషి చేస్తాయి. భద్రత, రక్షణ ప్రక్రియల రూపకల్పనకు ప్రోత్సాహం, రక్షణాత్మక నియంత్రణ చట్రాల ఏర్పాటు, నియమాధారిత ద్వైపాక్షిక సాంకేతిక వాణిజ్యం-సరఫరా శ్రేణుల మరింత బలోపేతం వంటివి కూడా ఇందులో భాగంగా ఉంటాయి.

విశ్వసనీయ విక్రయ చట్రాలపై సహకారం దిశగా ద్వైపాక్షిక యంత్రాంగం ఏర్పాటు

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సురక్షిత, విశ్వసనీయ, పటిష్ట సముద్రగర్భ కేబుల్ సంధానానికి మద్దతుగా కేబుల్ అనుసంధానం-పటిష్ఠత కోసం ఏర్పాటు చేసిన క్వాడ్ భాగస్వామ్యం సహా, భారత్-ఆస్ట్రేలియా సహకారాన్ని ప్రోత్సహించడం. ఉత్తమ పద్ధతుల ఆదానప్రదానం, సమాచార మార్పిడి, సమన్వయం మెరుగుదల, ముప్పులు, విధ్వంసం సహా సముద్రగర్భ కేబుల్ మౌలిక సదుపాయాలకు ఎదురయ్యే ప్రమాదాల పరిష్కారం దిశగా సహకార బలోపేతం.

సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థలకు రక్షణపై రెండు దేశాల్లోని పరిశోధన సంస్థల మధ్య సహకారాభివృద్ధి సహా వారి కృషికి బలం చేకూర్చేందుకు సహ-అభివృద్ధి, పరిశోధనలకు సదుపాయాల కల్పన.

సమన్వయంతో పెట్టుబడులు-నియంత్రణల అనుసంధానం, రీసైక్లింగ్, పునరుద్ధరణ సహా సురక్షిత కీలక ఖనిజాల సరఫరా వ్యవస్థలపై అభివృద్ధిపై సహకారం.

ఆస్ట్రేలియా-భారత్ వ్యాపారాల మధ్య వాణిజ్య సహకారం, వ్యాపార వైవిధ్యీకరణకు ప్రోత్సాహం, అలాగే ప్రస్తుత కార్యక్రమాలను అనుసంధానించడం సహా సంబంధిత ఉన్నత సంస్థల మధ్య సంబంధాల బలోపేతం.

ప్రాధాన్యంగల కీలక సాంకేతికతల భద్రత, పునరుత్థాన సామర్థ్యం, సమగ్రతల బలోపేతం సహా కృత్రిమ మేధ (ఏఐ), అంతరిక్ష సాంకేతికతలు, టెలికమ్యూనికేషన్లు, బయోటెక్నాలజీ, అత్యాధునిక మూలకాలు వంటి కీలక రంగాల్లో నవ్య సాంకేతిక ఆవిష్కరణ దిశగా రెండు దేశాలూ సంయుక్తంగ కృషి చేస్తాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో దీర్ఘకాలిక ఆర్థిక భద్రత, ప్రాంతీయ స్థిరత్వానికి తోడ్పాటుగా అవసరమైన డిజిటల్, భౌతిక మౌలిక సదుపాయాల పరిరక్షణ, ఆవిష్కరణలు-పరిశోధనల వేగం పెంపు, పరస్పర సంధానంతో ఏకాభిప్రాయ సహిత అంతర్జాతీయ ప్రమాణాల రూపకల్పనకు కృషి చేస్తాయి.

విశ్వసనీయ, సురక్షిత కృత్రిమ మేధ దిశగా అంతర్జాతీయ ప్రమాణాల మెరుగుదల కోసం అంతర్జాతీయ కృషిని సద్వినియోగం చేసుకోవాలని రెండు దేశాలు నిర్ణయించాయి. ఇందుకోసం ప్రజాస్వామ్య విలువల ప్రాతిపదికన ఏకాభిప్రాయంతో వివిధ రంగాల భాగస్వామ్య చట్రాలను రూపొందించుకోవాలని సంకల్పించాయి. ఈ ప్రక్రియలో భాగంగా భారత్-ఆస్ట్రేలియా విద్యాసంస్థలు, ప్రైవేట్ రంగాల మధ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించాలని తీర్మానించాయి. ఈ కార్యక్రమాల ద్వారా ఉభయ దేశాల పౌరులకు వాస్తవిక ప్రయోజనాలను... అంటే- ఏఐ పరిశోధకులు, నిపుణులు, విధాన రూపకర్తలు, ఉద్యోగులకు అవసరమైన విజ్ఞానాన్ని, నైపుణ్యాలను సమకూరుతాయి. ఏఐ సాంకేతికతల సురక్షిత రూపకల్పన, వినియోగాల కోసం ఉమ్మడి సూత్రాలు ఉత్తమ పద్ధతులను ప్రోత్సహించడంలో ఈ విజ్ఞానం దోహదం చేస్తుంది. మరోవైపు కంప్యూటింగ్ సామర్థ్యం, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ఎల్ఎల్ఎం), ఏఐ-తత్సంబంధిత మౌలిక సదుపాయాల సురక్షిత వినియోగ విధానాల ఆదానప్రదానానికి ఈ కృషి తోడ్పడుతుంది.

ఆధునిక పదార్థాలు, టెలికమ్యూనికేషన్స్, బయోటెక్నాలజీ వంటి ప్రాధాన్య రంగాలపై భారత్-ఆస్ట్రేలియా నిశితంగా దృష్టి సారిస్తాయి. ఈ మేరకు పరిశోధన, ఆవిష్కరణలు, పెట్టుబడి భాగస్వామ్యాలను మరింత ముమ్మరం చేయాలని నిర్ణయించాయి. ఈ లక్ష్య సాధన దిశగా ప్రస్తుతం అమలయ్యే కార్యక్రమాల్లో తగిన మార్పులు చేసుకుంటాయి. తద్వారా పరస్పరం వాస్తవిక ప్రయోజనాలు లభించే పరిశోధన ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తాయి. ఈ కృషితో ద్వైపాక్షకంగానే కాకుండా విస్తృత ఇండో-పసిఫిక్ ప్రాంతానికీ లబ్ధి చేకూరుతుంది.

అంతరిక్ష రంగంలో రెండు దేశాల మధ్య భాగస్వామ్యం పరిణతి చెందుతుండటాన్ని భారత్, ఆస్ట్రేలియాలలో వేగంగా పురోగమిస్తున్న అంతరిక్ష రంగ కార్యకలాపాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉభయ దేశాల్లో ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ప్రాజెక్టులు సహా సంయుక్త వాణిజ్య కార్యక్రమాలకు ప్రోత్సాహం దిశగా పరస్పర సహకార విస్తృతికి నిర్ణయించాయి.

సైబర్, డిజిటల్ రంగాల రక్షణ-భద్రతల బలోపేతానికి భారత్-ఆస్ట్రేలియా సంయుక్తంగా కృషి చేస్తాయి. సైబర్ నేరాల నియంత్రణ, హానికర సైబర్ కార్యకలాపాల నిరోధం ఇందులో భాగంగా ఉంటాయి. ఈ క్రమంలో సైబర్, సాంకేతిక భద్రత ప్రమాణాల సంబంధిత విజ్ఞానాన్ని, అనుభవాలను పంచుకోవడం సహా కీలక జాతీయ మౌలిక సదుపాయాల రక్షణకు ప్రాధాన్యమిస్తాయి.

సామర్థ్య వికాస చర్యలు, ప్రాంతీయ-బహుపాక్షిక సహకార అవకాశాల క్రమబద్ధీకరణ కోసం సైబర్, ఐసీటీ రంగాలలో సమగ్ర ద్వైపాక్షిక యంత్రాంగం ఏర్పాటవుతుంది. వివిధ కార్యాచరణ మార్గాల మధ్య విధానపరమైన స్పష్టతకు భరోసా ఇస్తూ ఒకే రకమైన కార్యకలాపాలు పునరావృతం కాకుండా ఈ యంత్రాంగం పర్యవేక్షిస్తుంది.

ఐక్యరాజ్యసమితి నిర్దేశిత సైబర్ ప్రక్రియలలో సహకార బలోపేతానికి రెండు దేశాలూ చర్యలు చేపట్టనున్నాయి. అలాగే, సమాచార నిర్వహణ సదుపాయాలు సహా టెలికమ్యూనికేషన్స్ రంగంలో సైబర్ భద్రతపై అంతర్జాతీయ సహకారంపై చర్చలను మరింత ముమ్మరం చేయాలని నిర్ణయించాయి.

సైబర్ భద్రత, సాంకేతిక రంగాలలో భారత్-ఆస్ట్రేలియా వాణిజ్య సంస్థల మధ్య పెట్టుబడుల పెంపు, వ్యాపార విస్తరణకు మరిన్ని అవకాశాలను సృష్టిస్తాయి. సైబర్ భద్రత రంగంలో రెండు దేశాల ప్రభుత్వ సంస్థలు, ఇతర భాగస్వాములను ఒకే వేదికపైకి తేవడం కోసం సంయుక్త చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తాయి.

కీలక నైపుణ్యాల వృద్ధి, ఆదానప్రదానం కోసం ఒక సైబర్ సాంకేతిక నైపుణ్య ఇంక్యుబేటర్ కూడలిని ఏర్పాటు చేస్తాయి.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో డిజిటల్ రూపం సంతరించుకుంటున్న ఆర్థిక వ్యవస్థలకు మద్దతుగా విశ్వసనీయ, విస్తరణీయ సాంకేతిక పరిష్కారాలు చూపడంలో భారత్-ఆస్ట్రేలియా సంయుక్తంగా కృషి చేస్తాయి. అలాగే, ప్రాంతీయ సామర్థ్యాలను బలోపేతం చేయగల నిర్దిష్ట ప్రాజెక్టులను గుర్తించి, ప్రగతి సంబంధిత సమస్యల పరిష్కారానికి కలసి ముందడుగు వేస్తాయి.

ఇండో-పసిఫిక్ దేశాలతో కొత్త భాగస్వామ్య ఆదానప్రదానానికి భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాల (డీపీఐ) సూత్రాధారితంగా రెండు దేశాలూ మద్దతిస్తాయి.

కాలుష్య రహిత పునరుత్పాదక ఇంధనం, మౌలిక సదుపాయాలు, అనుసంధానం, డిజిటల్ రూపాంతరీకరణ, ఆరోగ్యం, సామాజిక రక్షణ, నైపుణ్యాభివృద్ధి, విద్య, పరిశోధన తదితర రంగాల్లో చౌక ‘డీపీఐ’ పరిష్కారాలను ఇండో-పసిఫిక్ ప్రాంతానికి విస్తరింపజేస్తాయి.

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ‘డీపీఐ’ ముమ్మర వినియోగం ద్వారా డిజిటల్ స్థిరత్వంలో ద్వైపాక్షిక నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తాయి. స్థానిక అనుకూల డిజిటల్ పర్యావరణ వ్యవస్థల రూపకల్పన కోసం సంయుక్త ప్రాజెక్టులు సహా వివిధ సామర్థ్య వికాస చర్యల ద్వారా ప్రాథమిక డిజిటల్ పరిష్కారాలపై దృష్టి సారించే ఇండో-పసిఫిక్ ప్రయోగాత్మక ప్రాజెక్టులకూ వీలు కల్పిస్తాయి.

రక్షణ రంగంలో వివిధ సవాళ్లు-సామర్థ్యాలపై ఉమ్మడి అవగాహన పెంపు దిశగా రక్షణ పరిశోధన భాగస్వామ్యాలను రెండు దేశాలూ సద్వినియోగం చేసుకుంటాయి. మునుపటి ఉమ్మడి పరిశోధనల ఆధారంగా పరస్పర ప్రయోజనానుగుణ భవిష్యత్తు ప్రాజెక్టులను రూపొందిస్తాయి. రక్షణ సహకారంపై అవగాహన ఒప్పందం (ఓఏజ)లోని ‘డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ’ సహకార నిబంధనల మేరకు రక్షణ శాస్త్రవిజ్ఞాన సంస్థల మధ్య ఆదానప్రదానాన్ని ముమ్మరం చేస్తాయి.

రక్షణ మంత్రుల స్థాయి చర్చలు, రక్షణరంగ విధాన చర్చలు, పరిశ్రమలు-పరిశోధన, పదార్థాలపై ఏర్పాటైన సంయుక్త కార్యాచరణ బృందం తదితరాల ద్వారా రక్షణ శాస్త్ర-సాంకేతిక ప్రాథమ్యాలపై చర్చల వేగాన్ని పెంచుతాయి.

ఆస్ట్రేలియాలోని ‘డిఫెన్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ గ్రూప్’, భారత ‘డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్’ (డీఆర్‌డీఓ)ల మధ్య సంస్థాగత సంబంధాలను రెండు దేశాలూ పటిష్టం చేస్తాయి. పరిశోధన సహకారాన్ని వేగిరపరచే దిశగా కార్యాచరణ బృందం స్థాయిలో ఆదానప్రదానాన్ని క్రమబద్ధీకరిస్తాయి.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర.. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం



కరీంనగర్, జులై 10: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలది కీలక పాత్ర అని సీపీ గౌస్ ఆలం అన్నారు. గన్నేరువరం మండలంలోని పారువెల్ల, ఖాసీంపేట గ్రామాల్లో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రతీ వీధిలో సీసీ కెమెరాలు ఉండటం వల్ల ప్రజల భద్రతకు భరోసా ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 700 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లకు అలవాటు పడవద్దన్నారు. వాహనదారులు, ప్రయాణికులు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్ లను అందజేసి, పారువెల్ల, ఖాసీంపేట గ్రామాల మధ్యలో నిర్వహిస్తున్న వాలి వ్యాచ్ ను టాస్ వేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ విజయ్ కుమార్, తిమ్మాపూర్ సీఐ రమేష్, ఎస్ఐ నరేందర్ రెడ్డి, పారువెల్ల సర్పంచ్ యల్లా లక్ష్మి రాంరెడ్డి, ఖాసీంపేట సర్పంచ్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ప్రజలను భయాందోళనలకు గురి చేసిన స్కై లాబ్

స్కై లాబ్... ఈ పేరు నేటి తరానికి అంతగా తెలియక పోవచ్చు. దాదాపు అర్ధ శతాబ్ది క్రితం జనజీవనాన్ని అతలాకుతలం చేసిన సంఘటన. ప్రధానంగా తెలంగాణ అదీ ఉత్తర తెలంగాణ ప్రజలను తీవ్ర భయ భ్రాంతులకు గురిచేసిన నేపథ్యం. యాభై ఏళ్ల పైబడిన వారిని కదిలిస్తే ఈ నాటికీ వెంటనే గుర్తుకు వచ్చి, ఆనాటి తీవ్ర భయాందోళనల పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు వివరించే అరుదైన సంఘటనల అపురూప అపూర్వ దృశ్యం.

అంతరిక్షం లో మానవులచే నిర్మించిన పరిశోధనా ఉపగ్రహం లాంటి పరికరాల నిర్మిత అతిపెద్ద కేంద్రాన్ని స్కైలాబ్ అంటారు. భూమి గురుత్వాకర్షణ శక్తిని ఛేదించి మొదటి కృత్రిమ ఉపగ్రహం స్పుత్నిక్-1ని 1957-అక్టోబర్‌లో అప్పటి సోవియట్ యూనియన్ పంపించడంతో అంతరిక్ష పరిశోధనలు వేగం పుంజు కున్నాయి. ఆ తర్వాత అంతరిక్షం లోనే మానవుడు పరిశోధనా కేంద్రాన్ని (స్కైలాబ్) స్థాపించి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం, దానిలోనే ఉంటూ పరిశోధనలు చేస్తూ సౌర కుటుంబాన్ని గురించి ఎన్నో కొత్త విషయాలను తెలుసు కోవడానికి ఈ విజ్ఞానం ఉపయోగించు కున్నాడు. ఈ కేంద్రాన్ని అమెరికా, రష్యా, ఇతర అభివృద్ధి చెందిన దేశాలు అంతరిక్షంలో పరిశోధనలు చేయడానికి నిర్మించాయి. ఈ అంతరిక్ష కేంద్రం భూమి పరిభ్రమించే లోపలి కక్ష్యతో నిర్మించబడింది. ఈ అంతరిక్ష కేంద్రం భూమికి 278 నుండి 460 కి. మీ. ఎత్తులో ఉండి, సరాసరి గంటకు 27, 743 కి. మీ. వేగంతో పరిభ్రమిస్తూ ఉండేది. ఇది రోజుకు 16 సార్లు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేసేది. ఈ కేంద్రంలో వ్యోమగాములు ఉంటూ, భూగోళ వాతావరణ అధ్యయనానికి, సమాచార ప్రసార సాధనంగా స్కై లాబ్ ను వినియోగించు కున్నారు.

స్కైలాబ్ మొదటి యునైటెడ్ స్టేట్స్ అంతరిక్ష కేంద్రం, నాసా ప్రారంభించింది. మే 14 1973, ఫిబ్రవరి 1974 మధ్య 24 వారాల పాటు క్రియాశీలంగా ఉంది. ఇది అంతరిక్ష పరిశోధక నౌక. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా దీన్ని రూపొందించింది. కక్ష్యలోకి ప్రవేశపెట్టిన దీని జీవిత కాలం ఏడేళ్లు. అయితే అంతరిక్షం లోకి పంపిన తర్వాత దీన్ని భూమి మీదకు తిరిగి సురక్షితంగా ఎలా తీసుకు రావాలన్న విషయంలో నాసా సరిగా వ్యవహరించలేదు. అయితే ల్యాబ్ గతి తప్పడం మొదలైంది. ఉపగ్రహ జీవిత కాలం ప్రణాళిక ప్రకారం 1974 లో స్కైల్యాబ్ జీవిత కాలం ముగిసిన తరువాత 8 -10 ఏళ్ళ వరకు కక్ష్యలోనే ఉండాల్సి ఉండగా, సౌర కార్యకలాపాలు ఎక్కువ కావడంతో ఉచ్ఛస్థాయిల్లో వాతావరణం పలుచబడి



జీవిత కాలం సమయానికంటే ముందే స్కైల్యాబ్ భూ వాతావరణం లోకి ప్రవేశించింది.

1978 చివరలో స్కైలాబ్ నియంత్రణ కోల్పోయి గతి తప్పడం గుర్తించారు. చివరకు అది వేగంగా వచ్చి భూమిని ఢీకొనడం తప్ప వేరే మార్గం లేదని అంతా భావించారు. అదే విషయాన్ని నాటి ప్రధాన ప్రసార మాధ్యమం అయిన రేడియోల ద్వారా పదే పదే ప్రకటింప చేశారు. ఫలితంగా ప్రజలు విపరీత భయాందోళనలకు గురయ్యారు. ఇంకా భారత భూభాగంలోనే ఢీ కొంటుందన్న ప్రచారం ఊపందుకుంది. అదే సమయంలో తెలంగాణ ప్రాంతంలో... నిజామాబాద్ ఎక్కడైనా పడే అవకాశం ఉందంటూ పత్రికల్లో వెలువడ్డ వార్తలు మరింత ఆందోళనకు దారితీసింది. నాడు ఊరూరికీ పత్రికలు రాకున్నా, ఈ వార్తలు దావనంలా వ్యాపించాయి. నాటి ప్రధాన ప్రసార సాధనమైన రేడియో ఉన్న ఇళ్ళ వద్ద జనం గుమి కూడడం, భయాందోళనలకు లోనవడం సర్వ సాధారణంగా మారింది.

తెలంగాణ మొత్తం స్కైలాబ్ బారిన పడుతుందన్న శరవేగ ప్రచారం చదువుకున్న, చదువులేని వారు అన్న తేడా లేకుండా తీవ్ర ఆందోళనలో ముంచెత్తి వేసింది. 1979లో జరిగిన ఈ సంఘటన మూడు వారాల పాటు ప్రతి ఆవాస ప్రాంతంలో ఆబాల గోపాలాన్ని కంటికి కునుకు లేకుండా చేసింది.

స్కైలాబ్ వలన భూమికి భారీ నష్టం కలుగుతుందని శాస్త్రవేత్తలు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. భూమి పై పడితే మహా ప్రళయం సంభవించి నట్టేనని భావించిన అనేక మంది ప్రజలు చాలామంది తమ జీవితాలకు అవే చివరి రోజులని భావించి ప్రాణాలను అరి చేతుల్లో పెట్టుకుని కాలం వెళ్ళ దీశారు. ఆకాశం నుంచి నక్షత్రం లాంటిది భూమిని ఢీకొన బోతోందని, దీంతో ప్రళయం వస్తుందని, మనుషులంతా చనిపోతారన్న ప్రచారం నానాటికీ అధికం అయింది.

అయితే అంతరిక్షంలో 24 వారాల పాటు పనిచేసిన తరువాత, కక్ష్య క్షీణించి భూవాతావరణం లోకి ప్రవేశించి స్కై లాబ్ విచ్ఛిన్నమై పోయింది. అంతరిక్ష ముగ్గురు వ్యోమగాముల బృందం స్కైల్యాబ్ భూమిపై పడి నాశనమయ్యే లోపు తమకున్న పరిజ్ఞానంతో 1974 ఫిబ్రవరి 8 న భూమికి తిగి వచ్చేశారు. 1979 జూలై 11 న స్కైల్యాబ్ భూవాతావరణం లోకి ప్రవేశించి విచ్ఛిన్నమై పోయింది. స్కైలాబ్ కక్ష్య క్షీణించి, జూలై 11, 1979 న హిందూ మహాసముద్రం మీదుగా వాతావరణంలో కాలిపోయింది. దాని శకలాలు హిందూ మహా సముద్రం లోను, పశ్చిమా ఆస్ట్రేలియా లోనూ పడ్డాయి.

ఇదిలా ఉంటే స్కై లాబ్ భూమిని ఢీకొని భారీ ప్రాణ, ఆస్తి తదితర నష్టం కలిగించ గలదనే ఉధృత ప్రచార నేపథ్యంలో...నాటి అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి... 1979 జూలై 11న ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన ధర్మపురిలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం లో స్థానికుల సమక్షంలో, వేద పండితులతో కూడి భగవదారాధన లో గడపడం, ఆ తర్వాత హైదరాబాద్ కు తిరిగి వెళ్ళడం విశేషం..

జూలై 11... స్కైల్యాబ్ భూవాతావరణం లోకి ప్రవేశించి విచ్ఛిన్నమైన దినం



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# వేములవాడ రోడ్డు ప్రమాదం..

## చికిత్స పొందుతూ మరో ఇద్దరు కూలీలు మృతి





రాజన్న సిరిసిల్ల, జులై 10:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం అనుపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతిచెందారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరు కూలీలు మరణించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది.

మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా పూణే గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇటీవల తెలంగాణకు వచ్చారు. కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలంలోని జెగ్గారావుపల్లె వద్ద కొదురుపాకకు చెందిన కాంట్రాక్టర్ ద్వారా ఇక్కడ వరినాట్లకు కూలీలుగా వెళ్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం నాడు తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో వరి నాట్లు వేసేందుకు 17 మంది మహిళలు, ఆరుగురు పురుషులు వెళ్లారు. నాట్లు ముగించుకుని సాయంత్రం డ్రైవర్‌తో సహా మొత్తం 24 మంది టాటా ఏస్ వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. వారు అనుపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి ఆర్టీసీ అద్దె వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో దాదాపు పది అడుగుల దూరంలోకి ఎగిరిపడి పల్టీ కొట్టింది. ఉ వనీణతీజీజూష్త్రతిఇ ఖీవటవతీవనిఇవ

ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వాసుదేవ్ (35) కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌తో పాటు 23 మందదికి తీవ్ర గాయాలయ్యాయయి. వారిని హుటాహుటిన వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా.. అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

# కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం: ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

## -సంస్థాగత బలోపేతంపై జిల్లా నేతలతో సమీక్ష

## -ఏఐసీసీ, టీపీసీసీ నివేదికలను సకాలంలో సమర్పించాలని సూచన



వరంగల్, జులై 10: టీపీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయి కార్యాచరణ, ఏఐసీసీ-టీపీసీసీ నివేదికల సమర్పణపై హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్య సమావేశం నిర్వహించారు. హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండల అధ్యక్షులు, వర్ధన్నపేట నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు. టీపీసీసీ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్, అధికార ప్రతినిధి కూచన రవళి, ట్రైనర్ పులి అనిల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేయడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతి మండలం, ప్రతి డివిజన్‌లో పార్టీ నాయకులు ప్రజలతో నిరంతరం మమేకమై సంస్థాగత కార్యాచరణను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ, టీపీసీసీలకు సమర్పించాల్సిన నివేదికలను నిర్దేశిత గడువులో పూర్తి చేసి అందించాలని సూచించారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో వ్యవహరించాలని, పార్టీ ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశం అనంతరం 'చరక' కార్యక్రమాన్ని నిర్వహించగా, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# నిద్రిస్తున్న భర్తను బండరాయితో కొట్టి చంపిన భార్య, కొడుకు

కరీంనగర్, జులై 10: జిల్లాలోని సుల్తానాబాద్ మండలం కదంబపూర్ గ్రామంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి తన సొంత భార్య, కొడుకు చేతిలోనే దారుణ హత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన సయ్యద్ గోరమియా అనే వ్యక్తి గత కొంతకాలంగా తీవ్రమైన కుటుంబ సమస్యలతో సతమతమవుతూ, వాటి నుంచి ఉపశమనం కోసం మద్యానికి బానిసయ్యాడు. రోజూ మందు తాగి వచ్చి ఇంట్లో గొడవలు చేయడం, కుటుంబ సభ్యులను వేధించడం నిత్యకృత్యంగా మారింది. ఈ క్రమంలో అతని భార్య గోరేబి, కొడుకు సయ్యద్ అలీ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. ఈ వేధింపులకు ఎలాగైనా ముగింపు పలకాలనే ఉద్దేశంతో వారు ఘాతుకానికి ఒడిగట్టారు.

సయ్యద్ గోరమియా మద్యం మత్తులో గాఢనిద్రలో ఉన్న సమయంలో.. భార్య గోరేబి, కొడుకు సయ్యద్ అలీ కలిసి అతడిపై దాడి చేయడానికి పక్కా ప్రణాళిక వేసుకున్నారు. కానీ ప్లాన్ మార్చి.. ఒక పెద్ద బండరాయితో నిద్రిస్తున్న గోరమియా తలపై అత్యంత విచక్షణారహితంగా బాదారు. తీవ్రమైన గాయాలు కావడంతో గోరమియా అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న సుల్తానాబాద్ పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితులైన భార్య, కొడుకును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# రైల్వే స్టేషన్‌లో పసికందును వదిలేసిన తల్లి.. నారాయణపేట జిల్లాలో దారుణం

మహబూబ్‌నగర్, జులై 10: నారాయణపేట జిల్లా కృష్ణా మండల కేంద్రంలోని స్థానిక రైల్వే స్టేషన్‌లో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని ఓ మహిళ నవజాత మగ పసికందును రైల్వే స్టేషన్ ఆవరణలో వదిలేసి వెళ్లిపోవడం కలకలం రేపింది. శుక్రవారం ఉదయం పసికందు ఏడుపు వినిపించడంతో ప్రయాణికులు, రైల్వే సిబ్బంది గమనించారు. వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు.

ఘటనాస్థలికి చేరుకున్న రైల్వే పోలీసులు శిశువును వైద్య పరీక్షల నిమిత్తం సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్య పరిస్థితిని నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. కాగా, పసికందును వదిలేసి వెళ్లిన మహిళ ఎవరు.. ఏ పరిస్థితుల్లో ఈ ఘటనకు పాల్పడింది.. అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్ పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఇలా పసికందును వదిలేసి వెళ్లడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# విద్యార్థులచే టాయిలెట్లు, వాటర్ ట్యాంకులు శుభ్రం

నల్గొండ, జులై 10: పాఠశాల విద్యార్థులతో టాయిలెట్లు, వాటర్ ట్యాంకులు శుభ్రం చేయించిన ఘటన పోచంపల్లి పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చోటుచేసుకుంది. పాఠశాలలో విద్యార్థులను టాయిలెట్ల పైకి ఎక్కించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని చీపుర్లు, బకెట్లను అందించడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ పిలుపు మేరకు శుక్రవారం విద్యా సంస్థలను బంద్ చేయించారు. స్థానిక జడ్పీహెచ్ఎస్ లో ఉదయం ప్రార్థన ముగిసిన అనంతరం 9, 10వ తరగతి విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం కృష్ణయ్యను వివరణ కోరగా తాను పిల్లలకు పని చెప్పలేదని, స్కావెంజర్ పని చేస్తుండగా పిల్లలు అక్కడికి వెళ్లారని తెలిపారు.

# సింగరేణిని నిలువుదోపిడీ చేసింది బీఆర్ఎస్: ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

## -మెడికల్ దందాతో టీబీజీకేఎస్ కోట్లు దండుకుందన్న ఆరోపణ

## -అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరని వ్యాఖ్య



కరీంనగర్, జులై 10:భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రభుత్వం తెలంగాణను అప్పుల పాలుచేయడంతో పాటు సింగరేణి సంస్థను నిలువుదోపిడీ చేసిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆరోపించారు. శుక్రవారం గోదావరిఖనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో పురోగమిస్తోందన్నారు. సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) మెడికల్ వ్యవహారాల్లో కోట్ల రూపాయల దందాకు పాల్పడిందని ఆరోపించారు. కన్నెపల్లి ప్రాజెక్టు, బొగ్గు నిల్వల అంశాలపై బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రస్తుత ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని రాజ్ ఠాకూర్ అన్నారు. ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారని, అబద్ధపు ప్రచారాలను నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలో విద్య, వైద్యం, మౌలిక వసతులు, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

# ఓటర్ జాబితా సవరణపై జేసీ కీలక ఆదేశాలు



అమరావతి, జులై 10:బాపట్ల జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిని జాయింట్ కలెక్టర్ కుమారి భావన వశిష్ఠ శుక్రవారం పరిశీలించారు. బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని రైలుపేట సచివాలయాన్ని సందర్శించిన ఆమె, కమిషనర్ ఎం. హాసిని, తహశీల్దార్ షేక్ సలీమాతో కలిసి గణన పత్రాల స్వీకరణ, నమోదు, ధృవీకరణ ప్రక్రియలను సమీక్షించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా పారదర్శకంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ స్పష్టం చేశారు.

# స్వర్ణ ఆంధ్ర విజన్‌తో గ్రామీణాభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే కూన రవికుమార్

అమరావతి, జులై 10: స్వర్ణ ఆంధ్ర విజన్ ద్వారా గ్రామీణ ఉపాధి, సంప్రదాయ చేతివృత్తులు, కుటీర పరిశ్రమల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఏర్పడతాయని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బుర్ల రామాంజనేయులు, బండారు శ్రావణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మ కంగా అమలు చేస్తున్న స్వర్ణ ఆంధ్ర విజన్‌పై విస్తృతం గా చర్చించినట్లు కూన రవికుమార్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను చేతివృత్తులు, సంప్రదాయ కళలు, కుటీర పరిశ్రమలకు కేంద్రాలుగా అభివృద్ధి చేయడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, స్థానిక కళాకారులకు మార్కెట్ విస్తరణ, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారత వంటి అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు వెల్లడించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.